


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY




సంపుటి 10 | సంచిక 59 | కర్నూలు | ఆదివారం 23 మార్చి 2025 | పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi

# త్వరలోనే దేవాలయ పాలకమండళ్లు

## వ్యవసాయ మార్కెట్ కమిటీలపైనా దృష్టి
## కసరత్తు చేస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు

అమరావతి,మార్చి22 : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే రెండు దఫాలుగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసింది.. కూటమిలో భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నేతలకు వివిధ నామినేటెడ్ పోస్టులు కట్టబెట్టారు.. ఇక, మూడో జాబితాలో మరికొన్ని కీలక పోస్టులను భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తోంది సర్కార్.. దేవాలయాల పాలక మండళ్లపై కసరత్తు పూర్తి చేశారు.. 222 మార్కెట్ యార్డ్ కమిటీల జాబితా సిద్ధం అవుతోందని సమాచారం. చైర్మన్ పదవులకు 2 నుంచి 3 పేర్ల ప్రతిపాదనలు రాగా.. ఈ వారంలో పదవుల భర్తీకి సన్నాహాలు సాగుతున్నాయి.. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల పాలక మండళ్లను భర్తీ చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది సర్కార్.. ఇప్పటికే పాలకమండళ్ల నియామకంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు పూర్తిస్తాయి నివేదిక వెళ్లగా.. తెలుగుదేశంతో పాటు- బీజేపీ, జనసేన పార్టీలిచ్చిన సిఫార్సుల జాబితా కూడా చంద్రబాబు వద్దకు చేరిందని సమాచారం.. ఈసారి మొత్తం 21 ప్రముఖ ఆలయాలకు పాలకమండళ్లను నియమించనున్నారు.. దేవాలయ కమిటీ- చైర్మన్ తో పాటు- సభ్యులను కూడా నియమించేందుకు రంగం సిద్ధం అవుతోంది..మరోవైపు.. వ్యవసాయ మార్కెట్ కమిటీలను నియమించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తిస్థాయి కసరత్తు చేస్తున్నారు.. ఏప్రిల్ మొదటి వారంలోగా మార్కెట్ యార్డ్ చైర్మన్ల నియామకాలను చేపట్టేందుకు కార్యాచరణను సిద్ధం చేస్తున్నారు.. ఇప్పటికే మార్కెట్ కమిటీ-ల నియామకాలకు సంబంధించిన పక్రియ మొదలు అయ్యింది.. ప్రతి జిల్లా నుంచి నివేదికలు తెప్పించుకుంటోంది అధిష్టానం.. రిజర్వేషన్ల ఆధారంగా పదవులను భర్తీ చేయబోతున్నారు.. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు ఓసీలకు సమ న్యాయం జరిగేలా సీఎం చంద్రబాబు కసరత్తు చేస్తున్నారట.. జిల్లాల



వారీగా రిజర్వేషన్లకు సంబంధించిన నివేదికలు కూడా సీఎం దగ్గరకు చేరాయట.. మహిళలకు కూడా అగ్రి కల్చరల్ మార్కెట్ కమిటీ- చైర్మన్లతో పాటు- డైరెక్టర్ల పదవులు దక్కే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది.. మొత్తంగా పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్న కొందరు నేతలకు.. ఈ దఫాలు పదవులు దక్కనున్నాయి..

# ఉప ముఖ్యమంత్రికి ఘన స్వాగతం





కర్నూలు, మార్చి 22: కర్నూలు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్ లో ఘన స్వాగతం లభించింది. శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలో ఫాం పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు జిల్లాకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రికి ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్ లో అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, డీఐజీ కోయ ప్రవీణ్, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, కోడుమూరు





ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయ సూర్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, టీటీడీ సభ్యులు మల్లెల రాజశేఖర్, డిఎఫ్ఓ శ్యామల, నందికొట్కూర్ ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి, ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ విద్యాసాగర్, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. పూడిచెర్ల లో ఫారం పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించి, బహిరంగసభలో పాల్గొన్న అనంతరం ఓర్వకల్లు ఎయిర్‌పోర్ట్ నుండి మధ్యాహ్నం 12.56 గంటలకు ఉపముఖ్యమంత్రి బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే జయ సూర్య తదితరులు సాదర వీడ్కోలు పలికారు.

# దక్షిణాదిలో సీట్లు తగ్గకుండా చూడండి

## ప్రధాని మోడీకి మాజీ సిఎం జగన్ లేఖ



అమరావతి,మార్చి22 : డీలిమిటేషన్ పై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ లేఖ రాశారు. దక్షణాది రాష్ట్రాలకు సీట్ల సంఖ్యలో తగ్గింపు లేకుండా చూడాలని లేఖలో ప్రధానిని కోరారు. 2026లో జరిగే డీలిమిటేషన్ పై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన ఉంది.. తమ రాష్ట్రాల్లో నియోజకవర్గాలు తగ్గుతాయనే చర్చ ఆందోళన కలిగిస్తోంది.. గత 15 ఏళ్లలో దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తగ్గింది.. గతంలో కేంద్రం ఇచ్చిన జనాభా నియంత్రణ పిలుపు మేరకు ఈ తగ్గుదల కనిపించింది.. ఇప్పుడు జనాభా లెక్కల ప్రకారం డిలిమినేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు భాగస్వామ్యం తగ్గుతుంది.. అందుకే జనాభా లెక్కల ప్రకారం ఈ డీలిమిటేషన్ లేకుండా చూడాలి అని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. అయితే, పార్లమెంటు-లో తీసుకునే విధాన నిర్ణయాలలో అన్ని రాష్ట్రాలకు సమాన భాగస్వామ్యం కల్పించేలా ఉండాలి అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అందుకే దక్షిణాదిన సీట్ల తగ్గింపు లేకుండా చూడాలని చెప్పారు. ఇక, అప్పుడే జాతీయ విధాన రూపకల్పనలో అన్ని రాష్ట్రాలకు సరైన భాగస్వామ్యం ఉంటుందని తెలిపారు. ఈ కోణంలో ఆలోచించి డీలిమిటేషన్ చేపట్టాలని కోరుకుంటు-న్నాను అని జగన్ లేఖలో వెల్లడించారు.

# పోసాని కృష్ణమురళి విడుదల



చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేష్‌ల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో పోసాని కృష్ణమురళి అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. గత కొన్ని రోజుల నుంచి ఆయన గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. నిన్న ఆయనకు గుంటూరులోని సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన జైలు నుంచి విడుదల అయ్యారు. వైసీపీ నేత అంబటి రాంబాబు జైలు వద్దకు వెళ్లారు. జైలు నుంచి బయటకు వచ్చిన పోసానికి స్వాగతం పలికారు. ఆ తర్వాత పోసాని తన కుటుంబసభ్యులతో కలిసి కారులో అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా, మార్చి 23వ తేదీ వరకు పోసాని రిమాండ్‌లో ఉండాల్సి ఉంది. సీఐడీ అధికారులు ఒక రోజు ఆయన్ని కస్టడీలోకి తీసుకుని విచారించారు. మరోసారి తమకు విచారణ నిమిత్తం అప్పగించాలని కోర్టును కోరారు. కానీ, ఈ లూపే కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది.గుంటూరులోని సీఐడీ కోర్టు పోసానికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల చొప్పున ఇద్దరు వ్యక్తులతోపాటు సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. చార్జిషీటు దాఖలు చేసే వరకు గుంటూరు సీఐడీ రీజినల్ ఆఫీసులో రెండు వారాలకోసారి హాజరు కావాలని షరతు పెట్టింది. పోలీసులు పిలిచినప్పుడు వచ్చి విచారణకు సహకరించాలని ఆదేశించింది. అయితే, పోసానిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యాప్తంగా చాలా చోట్ల కేసులు నమోదు అయి ఉన్నాయి. బెయిల్ మంజూరు అయిన తర్వాత కూడా ఆయన విడుదలపై ఉత్కంఠ నెలకొని ఉండింది. కోర్టు బెయిల్ మంజూరు చేసినా.. ఏ జిల్లా నుంచి అయినా పోలీసులు వచ్చి పీటీ వారెంట్‌తో పోసానిని మరోసారి అదుపులోకి తీసుకుంటారా? అన్న అనుమానం కూడా ఉండింది. కానీ, ఆ ఉత్కంఠకు తెరపడి, పోసాని విడుదలయ్యారు.

# ప్రజలకు ఆర్థిక స్థిరత్వ కల్పన కూటమి ప్రభుత్వ లక్ష్యం

3

రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం
ఉపాధి హామీ పనులతో అన్నదాతల కళ్లలో వెలుగు చూడాలి
గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది
కూటమి ప్రభుత్వం వ్యవస్థలను పటిష్టపరుస్తూ ముందుకు వెళ్తోంది
త్వరలో జిల్లాల్లో పర్యటనకు ప్రణాళికలు
కొణిదెల గ్రామంలో అభివృద్ధి పనులకు సొంత ట్రస్ట్ నుంచి రూ. 50 లక్షల నిధులు
కర్నూలు జిల్లా, పుడిచర్లలో ఫామ్ పాండ్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్
రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శ్రీకారం



# దక్షిణాదిని దెబ్బతీసే కుట్ర

## ఆమోదయోగ్యం కాని డీలిమిటేషన్ వద్దు
## సీట్ల పెంపు లేకుండా డీలిమిటేషన్ చేయాలి
## ఆర్థికంగానూ దక్షిణాదికి కేంద్రం మొండిచేయి
## చెన్నై సమావేశంలో సిఎం రేవంత్ విమర్శలు



చెన్నై,మార్చి22(ఆర్ఎన్ఎ): డీలిమిటేషన్.. ఇప్పుడు దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. ఎక్కడ విన్నా డీలిమిటేషన్ గురించే చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే.స్టాలిన్ సారథ్యంలో డీలిమిటేషన్‌పై చెన్నైలోని ఐటీసీ ఛోళా హోటల్‌లో దక్షిణాది రాష్ట్రాల సీఎంలు, విపక్షనేతలు సమావేశం అయ్యారు. దీంతో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు వాటిల్లే నష్టంపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డీ డీలిమిటేషన్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జనాభాప్రాతిపదికన ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలను అడ్డుకోవాల్సి ఉందన్నారు. పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రాలు భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలోనే తిరిగి పొందుతున్నామని పేర్కొన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. తెలంగాణలో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించాం. జీఎస్‌డీపీ, తలసరి ఆదాయంలోనూ వృద్ధి సాధించాం. తెలంగాణలో సుపరిపాలనతోపాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం. రూపాయి చెల్లిస్తే.. తమిళనాడుకు 26 పైసలు తిరిగొస్తున్నాయి. కర్ణాటకకు 16 పైసలు, తెలంగాణకు 42 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే లభిస్తున్నాయి. కానీ, బిహార్ మాత్రం రూపాయికి రూ.6.06 పొందుతోంది. యూపీకి రూ.2.03, మధ్యప్రదేశ్‌కు రూ.1.73 మేర లభిస్తోందని రేవంత్‌రెడ్డి వివరించారు. ఆర్థికంగా,రాజకీయంగా రాణిస్తున్న రాష్ట్రాలకు రాజకీయ పరిమితులు విఘాతం సృష్టిస్తాయి. డీలిమిటేషన్.. రాష్ట్రాల మధ్య రాజకీయ అసమానత్వం తీసుకువస్తుంది. పారదర్శకంగా లేని ఈ విధానంపై భాజపాను కట్టడి చేయాల్సి ఉందని హెచ్చరించారు లోక్‌సభ సీట్లు పెంచవద్దు.. కూడా లోక్‌సభ సీట్లు పెంచకుండా దీనిని చేపట్టాలని రేవంత్ కోరారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దీనివల్ల కలిగే విపరిణామాలను చర్చించాల్సి ఉందన్నారు. పెంచకుండానే డీలిమిటేషన్ చేశారు.. నరేంద్ర మోడీ కూడా అదే పని చేయాలి.. లోక్ సభ సీట్లు పెంచకూడదు.. జనాభా ప్రతిపదికన నియోజకవర్గ పునర్విభజన దక్షిణాది అంగీకరించదు.. దక్షిణాదిలో కుటుంబ నియంత్రణను సమర్థంగా అమలు చేశామని అన్నారు.ఉత్తరాది రాష్ట్రాల్లో కుటుంబ నియంత్రణ అమలు కాలేదు.. ఆర్థిక అభివృద్ధి, జీడీపీ, ఉద్యోగ కల్పనలో దక్షిణాది ముందుంది.. దేశానికి దక్షిణాది ఇచ్చేది ఎక్కువ.. మనకు తిరిగి వచ్చేది తక్కువ..డీలిమిటేషన్ రాజకీయంగా దక్షిణాదిని పరిమితం చేస్తుంది.. బాగా పని చేసిన మనకు శిక్ష వేస్తారా అని సీఎం రేవంత్ కేంద్రాన్ని ప్రశ్నించారు.

# కలసికట్టుగా జిల్లాను అగ్రగామిగా నిలుపుదాం :ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ,మార్చి22( : కలసికట్టుగా సమష్టి కృషితో ఎన్‌టీఆర్ జిల్లాను అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలుపుదామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జల్ జీవన్ మిషన్ వంటి పథకాలు జిల్లాలో మంచి ఫలితాలతో అమలయ్యేలా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. గౌరవ ప్రధాని నేతృత్వంలో వికసిత్ భారత్, గౌరవ ముఖ్యమంత్రి నేతృత్వంలో స్వర్ణాంధ్ర ??? 2047 లక్ష్యాల సాధనకు, 20 సూత్రాల అమలుకు కృషిచేయడం జరుగుతుందన్నారు. కేంద్రం నుంచి నిధులు, వనరుల సమీకరణ పరంగా కృషిచేయనున్నట్లు- ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.లక్ష్యాల సాధనకు జిల్లాస్థాయిలో టీమ్ ఎన్‌టీఆర్ కృషిచేస్తున్నట్లు- కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ పేదరికం లేని సమాజం మొదలు ఉద్యోగ, ఉపాధి కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, ఫార్మర్ అగ్రి-టె-క్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ -టె-క్ లక్ష్యాలతో పాటు- 20 సూత్రాల అమలుకూ జిల్లా అధికార యంత్రాంగం కృషిచేస్తున్నట్లు- తెలిపారు. వచ్చే అయిదేళ్లపాటు- 15 శాతం సుస్థిర వార్షిక వృద్ధిరేటు- లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు అమలుచేస్తున్నట్లు- వివరించారు. 20 సూత్రాల అమలు కార్యక్రమానికి సంబంధించిన సమీక్షా సమావేశంలో చర్చించి తీసుకున్న నిర్ణయాలు అన్ని శాఖల పురోగతిని మదించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు దోహదం కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సమావేశంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్స్, అదర్ కన్స్ స్ట్రక్షన్స్ వర్కర్స్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ గొట్టు-ముక్కల రఘురామరాజు, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, సీపీవో వై.శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## జల్లెడ పట్టి మరీ ఏరేస్తున్నారు...

ఐదు దశాబ్దాలుగా దేశంలో అతి పెద్ద శాంతిభద్రత సమస్యగా కొనసాగిన మావోయిస్టు ఉద్యమం చివరి దశకు చేరుకుందా? అవుననే అనిపిస్తోంది. 2026 మార్చి నాటికి 'మావోయిస్టు రహిత భారత్'గా దేశాన్ని మారుస్తామని గత ఏడాది కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఏ ఉద్దేశంతో ప్రకటించారో తెలియదు కానీ అప్పటినుంచి మావోయిస్టులకు స్థావరంగా ఉన్న బస్తర్ ప్రాంతంలో పెద్ద ఎత్తున మావోస్టులను ఏరివేస్తున్నారు. గురువారం ఒకే రోజు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, కాం కేర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఈ ఎదురు కాల్పుల్లో ఓ జవాను కూడా చనిపోయినట్లు చెబుతున్నారు. గత ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మావోస్టుల ఏరివేత ఉ ధృతమైంది.ఓ నివేదిక ప్రకారం ఈ ఏడాది జనవరి 22 నాటికి 344 మంది మావోస్టులు మృతి చెందగా ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 283 మంది చనిపోవడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది చోటు చేసుకున్న అతిపెద్ద ఘటనల్లో తాజా ఎన్‌కౌంటర్ రెండోది. గత ఫిబ్రవరి 9న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 31మంది మావోయిస్టులు మృతి చెందా రు. ఈ ఏడాది మూడు నెలల్లోనే దాదాపు 90 మంది నక్సల్స్ మృతి చెం దినట్లు అంచనా.వీరిలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా ఉన్నారు. 2026 మార్చి చివరినాటికల్లా దేశాన్ని 'మావోయిస్టు రహిత భా రత్'గా మారుస్తామని అమిత్ షా ప్రకటించడం వెనుక పక్కా ప్రణాళిక ఉ న్నట్లు కనిపిస్తోంది. గత దశాబ్దకాలంగా ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా మావోయిస్టు ఉద్యమం గణనీయంగా బలహీనమయినట్లు అమిత్ షా చెబుతున్నారు.గత ఏడాది కాలంగా బస్తర్‌లో మావోయిస్టు కార్యకలాపాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పౌరులు, భద్రతా జవాన్ల మర ణాలు అతి తక్కువగా ఉన్న మాట వాస్తవమే. అదే సమయంలో పెద్ద సం ఖ్యలో మావోయిస్టు కేడర్, నేతలు పోలీసుల ఎదుట లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. అయినా ఇంకా కొందరు మాత్రం లొంగి పోవడానికి ఇష్టపడడం లేదని, వారు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుందని అమిత్ షా అనేక సందర్భాల్లో హెచ్చరించారు. ఒకప్పుడు భద్రతా దళాలు అడుగు పెట్టడానికి భయపడే బస్తర్ ప్రాం తంలో మావోయిస్టు ఉ ద్యమం అంతిమ దశకు చేరుకోవడానికి కారణాలేమిటి? ప్రభుత్వం అనుసరిస్తున్న మూడంచెల వ్యూహమే దీనికి ప్రధాన కారణం.మావోయిస్టుల హింసను అదుపు చేయడానికి కౌంటర్ టెర్రరి జం దళాల ఆపరేషన్‌ను పెద్ద ఎత్తున చేపట్టడంతో పాటు స్థానిక ప్రజలను మావోయిస్టునుంచి దూరం చేయడానికి ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద ఎత్తు న అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం, లొంగిపోయే మావోయిస్టులకు పునరావాసం కల్పించడం ద్వారా వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకు రావడం ఈ వ్యూహంలోని ప్రధాన అంశాలు.ఛత్తీస్‌గఢ్‌లోని బీజే పీ ప్రభుత్వం స్థానిక ప్రజల హక్కులు, భూమి హక్కులను కాపాడడంపై ప్రధానంగా దృష్టిపెట్టడం దీనికి మరింత బలం చేకూరుస్తోంది. 2014 నుంచి ఇప్పటివరకు ఓ వైపు 1700 మందికి పైగా మావోయిస్టులు హతం కాగా, మరోవైపు 6,487 మందిని అరెస్టు చేయడం జరిగింది. 11,413 మంది లొంగిపోయారు. అయితే మావోయిస్టులు కొన్ని ప్రాంతాలకే పరిమితమైన నేపథ్యంలో ఇంత పెద్ద ఎత్తున ఎన్‌కౌంటర్లు జరగడంపై విమర్శ లు వస్తున్నాయి.ఉద్యమం బలహీనమైనందున మావోయిస్టులతో చర్చలకు ఎందుకు ప్రయత్నించడం లేదన్న ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ప్రభుత్వం ఇప్పు డు చూపిస్తున్న దూకుడును గమనిస్తే చర్చలకు అవకాశమే లేదని అర్థమవుతుంది. గత పదేళ్లలో మొత్తం 343 మంది మావోయిస్టు నేతలు మృతిచెందారు. ఇదే భద్రతా బలగాలకు వరంగా మా రింది. నక్సల్స్‌ను టార్గెట్‌గా చేసుకుని ఏరివేస్తున్నారు. ఛత్తీస్ గఢ్‌లోని కాంకేర్, నారాయణ్ పూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. బీనగుండా, పురుషోకోడు అటవీ ప్రాంతంలో ఉత్తర బస్తర్ మాద్ డివిజన్ కమిటీ సభ్యులు ఉ న్నారన్న సమాచారంతో బీఎస్ఎఫ్, డీఆర్జీ సంయుక్త బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతిచెందగా, డీఆర్జీ జవాను ఒకరు వీరమరణం పొందారని ఉన్నతాధికారులు తెలిపారు. మావోయిస్టుల మృతదేహాలతో పాటు భారీగా పేలుడు పదార్థాలు, ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టులు రెండు ప్రాంతాల్లో క్యాంపులను ఏర్పాటు చేసుకొని సమావేశం అయ్యారన్న సమాచారంతో పోలీస్ సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. గురువారం ఉదయం బలగాలకు మావోయిస్టులు ఎదురుపడడంతో ఇరువైపుల నుంచి కాల్పులు కొనసాగాయి. గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగిన ఎదురుకాల్పుల్లో ఓ చోట 26 మంది, మరో ఎన్ కౌంటర్ లో నలుగురు మావోయిస్టులు చనిపోయినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. వెల్లడించారు.

# రాష్ట్రం నుండి హజ్ కి వెళ్లే సౌకర్యం రద్దు చేసిన ఎన్డీఏ ప్రభుత్వాలు

### జిల్లా ఇన్చార్జి కలెక్టర్ కు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు

బద్వేలు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ నుండి ఈ ఏడాది హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు ఉన్న ఎంబర్కేషన్ పాయింట్ సౌకర్యాన్ని కేంద్ర రాష్ట్రాల్లోని ఎన్డీఏ ప్రభుత్వాలు రద్దు చేయడంపై కాంగ్రెస్ పార్టీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ కడప జిల్లా ఇన్చార్జి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ కు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ , కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమల్ భాష, కాంగ్రెస్ పార్టీ నేత హమీద్ శుక్రవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేవలం మత విద్వేషం తో ప్రత్యేకంగా విజయవాడ నుండి బయలుదేరే హజ్ యాత్రికుల సౌకర్యాన్ని రద్దు చేయడం తగదని స్పష్టం చేశారు . వెంటనే విజయవాడ నుండి హజ్ యాత్రికులు వెళ్లే విధంగా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు . కేంద్ర, రాష్ట్ర హజ్ కమిటీల సిఫార్సు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తెలియజేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పు పట్టింది. ఈ ఏడాది హజ్ కు వెళ్లే యాత్రికులు తక్కువగా ఉన్నారని, విమానయాన చార్జీలు ఎక్కువగా ఉన్నట్లు కారణాలుగా చూపి విజయవాడ నుండి బయలుదేరే సౌకర్యాన్ని రద్దు చేయడం మత్తవిద్వేషానికి నిదర్శనమని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. దీనికి ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉ ంటుందని హెచ్చరించారు. రాజకీయ పార్టీలు లేదా మైనార్టీల అభిప్రాయాలను పరిగణ లోనికి తీసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఏటా హజ్ కి వెళ్లే సౌకర్యాన్ని రద్దు చేయడానికి కక్షపూరిత చర్యగా విమర్శించారు. వెంటనే కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు ఎంబర్కేషన్ పాయింట్ విజయవాడ సౌకర్యాన్ని పునరుద్ధరించని పక్షంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

# ఏ-2 సునీల్ యాదవ్‌కూ ప్రాణభయమే

బద్వేలు,వైఎస్ వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉన్న వారికే కాదు నిందితులుగా ఉన్న వారికి కూడా ప్రాణభయం వెంటాడుతోంది. వివేకాను గొడ్డలితో నరికిన వ్యక్తిగా సీబీఐ చార్జిషీట్‌లో పేర్కొన్న సునీల్ యాదవ్ కడప ఎస్పీని కలిసి తనను వైసీపీ వాళ్లు బెదిరిస్తున్నారని రక్షణ కల్పించాలని కోరారు. సునీల్ యాదవ్ బెయిల్ మీద బయటకు వచ్చిన తర్వాత వైసీపీ క్యాంప్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వివేకా హత్య వెనుక ఉన్నది అందరూ చెప్పుకుంటున్న వాళ్లే అన్నట్లుగా మాట్లాడుతున్నారు. కొన్ని మీడియా చానళ్లకు ఇంటర్వ్యూలు కూడా ఇచ్చారు. దస్తగిరి తరహాలో సునీల్ మాట్లాడుతూండటం సంచలనంగా మారింది.ఈ క్రమంలో ఆయనకూ బెదిరింపులు వస్తున్నాయని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఇప్పటికే సునీల్ యాదవ్ ఇంటి పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు. రక్షణ కల్పించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. మరో వైపు హత్య అనే సినిమాపై కూడా ఎస్పీకి సునీల్ యాదవ్ ఫిర్యాదు చేశారు. ఇందులో తన తల్లిని అసభ్యంగా..క్రూరంగా చూపించారని.. మండిపడ్డారు. ఈ సినిమాను తీయించింది వైసీపీ నేతలేనని.. హత్యలో ఎనిమిది మంది పాల్గొంటే.. నలుగురే పాల్గొన్నట్లుగా చూపించారన్నారు. ఈ సినిమాను నిలిపివేయించాలని..

చర్యలు తీసుకోవాలని కోరారు.ఇప్పటికే అప్రూవర్ గా మారిన దస్తగిరి ప్రాణ భయం ఉందని చెప్పడంతో ఆయనకు భద్రత పెంచారు. వరుసగా సాక్షులు మరణిస్తూండటం.. మరో వైపు కేసు విచారణ ముందుకు సాగకపోవడంతో సాక్షులు, పాత్రధారులైన నిందితులు భయపడుతున్నారు. అసలు సూత్రధారులు సాక్ష్యాల్లేకుండా చేసేందుకు ఏం చేసేందుకైనా వెనుకాడరని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# భరత మాత స్వేచ్ఛ కోసం ఉరి తాడుని ముద్దాడిన విప్లవ చైతన్య మూర్తులు


**-నేడు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల వర్ధంతి**

**-నేడు భారతమాత ముద్దుబిడ్డల బలిదాన దినోత్సవం**



భరత మాతను బానిసపు సంకెళ్ళ నుండి విముక్తి చేయడానికై, మనందరి సంతోషం.. స్వేచ్ఛ కోసం 23 యేళ్ళ వయ్యస్సులోనే అనన్యమైన పోరాటాలు చేసి యావత్త భారత జాతి కి స్ఫూర్తిని కలిగించడం కోసం.. భరత మాత స్వేచ్ఛ కోసం ఉరి తాడుని ముద్దాడి తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యాగం చేసిన భరత మాత ముద్దు బిడ్డల్లు, విప్లవ చైతన్య మూర్తులు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల వర్ధంతి మర్చి 23న. ఏ స్వార్థం లేకుండా, ఏ పదవులు, ప్రయోజనాలు ఆశించకుండా చిరు ప్రాయంలోనే భరత మాత స్వేచ్ఛ కోసం బలిదానం చేసిన ఆ ముగ్గురు యువ కిషోరాల త్యాగాలను మనం స్మరించికొని, వారి వర్ధంతి (23 మార్చి) రోజున వారికి మన హ్రుదయపూర్వకంగా నివాళులు అర్పించడం ఈ దేశ పౌరులుగా మన కనీస బాధ్యత.. ఆ ముగ్గురునీ ఉరి తీసిన రోజు... భగత్ సింగ్ (సెప్టెంబరు 28, 1907 ?మార్చి 23, 1931):- స్వాతంత్ర్య సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు.భారత స్వాతంత్ర్యోద్యమమునకు పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులల్లో ఆయన ఒకరు. ఈ కారణంగానే 'షహీద్ భగత్ సింగ్ గా కొనియాడబడతాడు'. సుఖ్ దేవ్ థాపర్ (15 మే 1907 - మార్చి 23, 1931):- భారత స్వాతంత్ర్య సమర, ఉద్యమకారుడు. ఇతను భగత్ సింగ్ మరియు రాజ్‌గురు ల సహచరునిగా ప్రసిద్ధి. హరి శివరాం రాజ్ గురు (ఆగష్టు 24, 1908 - మార్చి 23, 1931):- భారత స్వాతంత్ర ఉద్యమ, ఉద్యమకారుడు. మహారాష్ట్ర లోని ఒక బ్రాహ్మణ కుటుంబానికి చెందినవాడు. ఇతను భగత్ సింగ్ మరియు సుఖ్ దేవ్ ల సహచరునిగా ప్రసిద్ధి... 1928లో భారత్‌లోని వర్ధమాన రాజకీయ పరిస్థితిపై నివేదికను కోరుతూ సర్ జాన్ సైమన్ నేతృత్వంలో బ్రిటీష్ ప్రభుత్వం ఒక కమిషన్‌ను ఏర్పాటు చేసింది. అయితే కమిషన్ సభ్యుడిగా ఒక్క భారతీయుడిని కూడా నియమించకపోవడంతో భారత రాజకీయ పార్టీలు దానిని బహిష్కరించాయి. ఫలితంగా దేశవ్యాప్తంగా పలు నిరసన ప్రదర్శనలు వెల్లువెత్తాయి. 30 అక్టోబరు 1928న కమిషన్ లాహోర్‌ను సందర్శించినప్పుడు సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా లాలా లజ్‌పత్ రాయ్ నేతృత్వంలో నిశ్శబ్ద అహింసా పద్ధతిలో ఒక నిరసన కార్యక్రమం జరిగింది. అయితే హింస తలెత్తడానికి పోలీసులు కారణమయ్యారు.

## నేడు ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవం




ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి 23న నిర్వహిస్తారు. ప్రకృతి సహజ ఆవసాలపై వాతావరణ మార్పులు చూపే ప్రభావం గురించి ప్రజలకు అవగాహన కలిగించడంకోసం ఈ దినోత్సవం జరుపుకుంటారు. సమాజపు భద్రత, శ్రేయస్సు కోసం జాతీయ వాతావరణ, జల సేవలు అందించే సహకారం గురించి ఈరోజు గుర్తుచేసుకుంటారు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు సంబంధించి వాతావరణంపై అధ్యయనం చేసేందుకు 1950, మార్చి 23న 180 దేశాల సభ్యత్వంతో ప్రపంచ వాతావరణ సంస్థ ప్రారంభించబడింది. ఆ సంస్థ ఏర్పడిన రోజును ప్రపంచ వాతావరణ శాస్త్ర దినోత్సవంగా నిర్ణయించబడింది. ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఈ దినోత్సవం జరుపబడుతుంది.వాతావరణ శాఖ నిపుణుల ఆధ్వర్యంలో ప్రజలకోసం అవగాహన సమావేశాలు, ఛాయాచిత్ర ప్రదర్శనలు జరుగుతాయి.వాతావరణ పరిశోధన చేసిన వాళ్ళకు ఈ దినోత్సవం సందర్భంగా అంతర్జాతీయ వాతావరణ సంస్థ బహుమతి, ప్రొఫెసర్ డాక్టర్ విల్హో వైసెల్ అవార్డు, ది నార్బర్ట్ గెర్బియర్-మమ్ అంతర్జాతీయ అవార్డు లు బహుమతులు అందజేయబడుతాయి.ఈ దినోత్సవాన్ని జరుపుకోవడానికి చాలా దేశాలు తపాలా బిళ్ళలను, ప్రత్యేక తపాలా స్టాంపు గుర్తులను విడుదల చేస్తాయి.

# ఆటోనగర్ లో ఎంపి చిన్నీ ఎమ్మెల్యే గద్దె పర్యటన

విజయవాడ,విజయవాడ ఆటోనగర్ లో ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సిఆర్డిఏ కమిషనర్ కన్నబాబు రోడ్లు పరిశీలన చేసారు. ఆటోనగర్ ప్రాంతం లో సిఆర్డిఏ పరిధి లో అభివృద్ధి చేయాల్సిన రోడ్లు పరిశీలించారు. గన్నవరం నుంచి మెట్రో, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నిడమానూరు జంక్షన్ వరకు ఫ్లైఓవర్ పనుల ప్రారంభం వల్ల ట్రాఫిక్ కి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల పై దృష్టి పెట్టారు. ఆటోనగర్లో కి లారీలు ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా వచ్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాల ఆటోనగర్ టెర్మినల్ రోడ్, బల్లెం వారి వీధి, మహానాడు రోడ్ జంక్షన్, శక్తి కళ్యాణ మండపం రోడ్, ఘంటసాల రోడ్లు సుపరిశీలించారు. గన్నవరం విమానాశ్రయం కి రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి మరో ప్రత్యామ్నాయ మార్గం కోసం రోడ్డును కుడా పరిశీలించారు. ×రామవరప్పాడు రింగ్ రోడ్డు నుంచి కేసరిపల్లి వరకు ఎస్‌ఎల్వీ గ్రాండ్ మీదగా గన్నవరం ఎయిర్పోర్ట్ కి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని సిఆర్డిఏ కమిషనర్ కన్నబాబుకి ఎంపి కేశినేని శివ నాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. ఎంపి కేశినేని శివ నాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచనల పై కలెక్టర్ లక్ష్మీ శ సానుకూలంగా స్పందించారు. ×మహానాడు రోడ్డు నుంచి నిడమానూరువరకు ఫ్లైఓవర్, గన్నవరం నుంచి వచ్చే మెట్రో పనులు పూర్తయితే విజయవాడకు ట్రాఫిక్ సమస్య ఉండదని ఎంపి కేశినేని శివ నాథ్ అన్నారు. ఈ లోపు ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ మార్గాల సిద్ధం చేసి తాత్కాలిక శాశ్వత రోడ్లు ఏర్పాటు చేస్తామని అన్నారు.

# ముగ్గురు ముఖ్య నేతల బ్యాక్ స్టెప్ ఎందుకు..

ఒంగోలు, మార్చి 22, అపోజిషన్‌లో ఉన్న పార్టీ నుంచి వలసలు కామన్. తెలుగు స్టేట్స్‌లో గత కొంతకాలంగా మనం ఇది చూస్తూనే ఉన్నాం. ఇటు తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి జంపింగ్స్ జరిగితే..ఏపీలో ప్రతిపక్ష వైసీపీ నుంచి కూటమి పార్టీలోకి వెళ్తున్నారు లీడర్లు. ఇదంతా రాజకీయాల్లో కొత్తేమి కాకపోయినా..వైసీపీని వీడిన, వీడుతున్న పలువురు నేతల విషయంలోనే ఆసక్తికర చర్చ జరుగుతోంది. వైసీపీని వీడిన ముగ్గురు నేతల ఎపిసోడ్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, లేటెస్ట్‌గా మర్రి రాజశేఖర్‌రెడ్డి..ఈ ముగ్గురు వైసీపీని వీడారు. ఇందులో బాలినేని శ్రీనివాస్‌రెడ్డి జగన్‌కు వరుసకు మామయ్య అవుతారు. విజయసాయిరెడ్డి జగన్‌తో పాటు 16నెలలు జైలులో ఉండి వచ్చారు. ఇక మర్రి రాజశేఖర్ అయితే జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచి ఆయన వెంట నడిచి లాయల్‌గా ఉ న్నారు.పదవులు వచ్చినా రాకున్నా..టికెట్ ఇచ్చిన ఇవ్వకున్నా అధినేత మాటే శాసనంగా పార్టీలో కొనసాగారు. తనకు ఇష్టం లేకపోయినా 2019లో విడదల రజినికి టికెట్ ఇస్తే ఆమె గెలుపునకు సహకరించారు. తనకు మంత్రి పదవి ఇస్తానన్న హామీ నిలబెట్టుకోకపోగా.. విడదల రజినికి మినిస్ట్రీ ఇచ్చినా కూడా సర్దుకుపోయారు మర్రి రాజశేఖర్ఇలా ఎన్ని త్యాగాలు చేసినా గుర్తింపు లేదు.. కనీసం బుజ్జగింపులు లేవని ఆయన తన దారి తాను చూసుకుంటున్నారు.ఈ ముగ్గురు నేతలు పార్టీ వీడటం వైసీపీ క్యాడర్‌తో పాటు ఏపీ పాలిటిక్స్‌లోనూ చర్చనీయాంశంగా ఉంది. అయితే పార్టీని వీడుతూనే..జగన్ టార్గెట్‌గా వాళ్లు చేస్తున్న విమర్శలు వైసీపీలో చర్చకు దారి తీస్తున్నాయి.నిజానికి బాలినేని వైసీపీని వీడుతారని చాలా రోజులు ప్రచారం జరిగింది. ఆయన పవన్ కల్యాణ్‌తో టచ్‌లోకి వెళ్లారని వార్తలు వచ్చాయి. జనసేనలో ఆయన చేరిక కొన్నిరోజులు వాయిదా కూడా పడింది. అయినా బాలినేని బుజ్జగించలేకపోయారు. జగన్ బాలినేనిని పిలిచి మాట్లాడ లేదంటున్నారు. ఆ తర్వాత విజయసాయిరెడ్డి విషయంలోనూ ఇదే జరిగిందంటున్నారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని ఆయన చెప్పగా..అందుకు అభ్యంతరం చెప్పలేదని మీ ఇష్టం అన్నట్లుగా రెస్పాండ్ అయినట్లు టాక్ నడుస్తోంది.ఇక లేటెస్ట్‌గా మర్రి రాజశేఖర్ వైసీపీని వీడి ఎమ్మెల్సీ పదవికి రిజైన్ చేశారు. ఆయన అసంతృప్తితో ఉన్నట్లు ఆరు నెలలుగా ప్రచారం జరుగుతోంది. పార్టీకి అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. అయినా మర్రి రాజశేఖర్‌ను సెట్ రైట్ చేయలేకపోయారు. ఆయన చివరకు టీడీపీలో చేరాలని డిసైడ్ చేసుకున్నాక..బొత్స సత్యనారాయణతో పాటు పలువురు నేతలతో నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ ఆయన వైసీపీలో ఉండేది లేదని తేల్చి చెప్పారు.ఈ ముగ్గురు కీలక నేతలు. బాలినేని, విజయసాయి, మర్రి రాజశేఖర్ జగన్‌కు ఆప్తులు. పార్టీ పెట్టినప్పటి నుంచి ఆయన వెంట నడిచిన ముఖ్యులు. ఈ ముగ్గురు పార్టీని వీడుతారని తెలిసినా వైసీపీ అధిష్టానం ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదన్న చర్చ జరుగుతోంది. అసంతృప్తిగా ఉన్నారని తెలిసినా పోతే పోనీలే అని లైట్ తీసుకున్నారన్న అన్న టాక్ వినిపిస్తోంది. లేకపోతే ఉ న్నోళ్లే మనోళ్లు..వెళ్లాలనకునేవారిని ఆపొద్దని డిసైడ్ అయ్యారా అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.వైసీపీ అధినేత తీరుకు కూడా ఇక్కడ ఇంట్రెస్టింగ్ చర్చగా మారింది. తానే పార్టీ..పార్టీనే తాను అన్నట్లుగా జగన్ ఆలోచన అని..పోయేవాళ్లు పోతే కొత్త నాయకులను తయారు చేసుకోవడం పెద్ద కష్టమేమి కాదన్న ధాట్‌లో ఫ్యాన్ పార్టీ అధినేత ఉన్నట్లు నేతలు చర్చించుకుంటున్నారు. తాను పార్టీ పెట్టినప్పుడు ఎంతమంది ఉండే..ఇప్పుడు ఎంత మంది ఉ న్నారో లెక్కలు వేసుకుంటున్నారట. పార్టీ బీఫామ్ ఇస్తామంటే క్యూ కట్టే వాళ్లలో ఒక్కో నియోజకవర్గంలో పదుల మంది నేతలు ఉ న్నట్లు చెప్పుకుంటున్నారట. పైగా తనను చూసే జనం ఓట్లేస్తారని జగన్ అభిప్రాయమట. 2019 ఎన్నికలకు ముందు ఓ ఇంటర్వ్యూలో జగన్ ఇదే విషయం చెప్పారని గుర్తు చేస్తున్నారు.సిచ్యువేషన్స్, ఈక్వేషన్స్, క్యాలిక్యులేషన్స్.. అన్నీ చూసుకున్నాకే అసంతృప్తుల జంపింగ్స్‌ను సీరియస్‌గా తీసుకోవడం లేదన్న టాక్ నడుస్తోంది. ఉండేవాళ్లు ఉంటారు.. పోయే వాళ్లు పోతారు..బతిమాలి పార్టీలో ఉంచితే.. వాళ్ల డిమాండ్స్ నెక్ట్స లెవల్ ఉంటాయని భావిస్తున్నారట. అందుకే ఎవరూ పార్టీని వీడుతున్నారని తెలిసినా..వైసీపీ పెద్దలుగా పేరున్నా నేతలే వారితో మాట్లాడుతున్నారట.

మళ్లీ మనమే అధికారంలోకి వస్తామ్..ఆలోచించండి అని చెప్పడం తప్ప..అసంతృప్తుల నేతలను అధినేత పిలిచి మాట్లాడిన దాఖలాలు లేవంటున్నారు. అందుకే పార్టీ మారిన నేతలు కూడా జగన్‌ను టార్గెట్ చేస్తున్నారట. ఇబ్బంది పడుతున్నామ్..తమకు న్యాయం జరగలేదని అని చెప్తే మీ ఇష్టం..మీరెక్కడున్నా బాగుండాలని కోరుకుంటానంటూ చెప్తున్నారట ఫ్యాన్ పార్టీ బాస్. కనీసం ఉండండి..భవిష్యత్‌లో మంచి అవకాశాలు ఇస్తామన్న మాట కూడా చెప్పట్లేదట.ఒకరు పోతే పది మంది నాయకులు పుట్టుకొస్తారనే ధీమాలో ఉన్నారట. ఏదైనా పార్టీ పెట్టినప్పటి నుంచి..జగన్ వెంట నడిచిన నేతలు వైసీపీని వీడటం క్యాడర్‌కు నిరాశ కలిగిస్తోందట. కానీ అధినేతే అల్టిమేట్..ఆయనే బలం, అతడే ఓ సైన్యం..అని లైన్స్‌కు లీడర్లు, క్యాడర్ కట్టుబడి ఉ ంటున్నారట. అలకబూనుతున్న జగన్ ఆప్తుల లిస్టులో ఇంకెవరెవరు ఉన్నారో చూడాలి మరి.

# ప్రజలకు ఆర్థిక స్థిరత్వ కల్పన కూటమి ప్రభుత్వ లక్ష్యం



**రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం**
**ఉపాధి హామీ పనులతో అన్నదాతల కళ్లలో వెలుగు చూడాలి**
**గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది**
**కూటమి ప్రభుత్వం వ్యవస్థలను పటిష్టపరుస్తూ ముందుకు వెళ్తోంది**
**త్వరలో జిల్లాల్లో పర్యటనకు ప్రణాళికలు**
**కొణిదెల గ్రామంలో అభివృద్ధి పనులకు సొంత ట్రస్ట్ నుంచి రూ. 50 లక్షల నిధులు**
**కర్నూలు జిల్లా, పుడిచర్లలో ఫామ్ పాండ్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్**
**రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శ్రీకారం**





కర్నూలు, మార్చి 22 (శ్రీచక్ర): రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మా ప్రభుత్వంలో వ్యవస్థలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా ఉపాధి హామీ పనులు ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి ఉండబట్టే పల్లె పండుగ విజయవంతం అయ్యిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి అంటే రైతన్న బలపడాలి. ఉపాధి హామీ పనులతో అన్నదాతల జీవితాల్లో కొత్త వెలుగులు రావాలి. అదే కూటమి ప్రభుత్వ ఆశయం అన్నారు. త్వరలో నియోజకవర్గానికి రెండు రోజులు పర్యటించి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. కొణిదెల గ్రామ అభివృద్ధి కోసం సొంత ట్రస్ట్ నుంచి రూ. 50 లక్షలు ప్రకటించారు. శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం, పుడిచెర్లలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో సేద్యపు నీటి కుంటల(ఫామ్ పాండ్స్) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "గత ప్రభుత్వంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రాజకీయ ఉపాధి పథకంగా మార్చారు. అలాంటి వాటిని ఎదుర్కోవడానికి బలమైన అధికారులను ఏర్పాటు చేశాం. పల్లె పండుగ పనుల్లో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. కర్నూలు జిల్లాలో రూ.75 కోట్లతో 117 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాం. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 98 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. రైతులు నీరు నిలవ చేసుకోగలిగితే సమస్య ఉండదు. వర్షాలు రాగానే పంట కుంటలు నిండేలా ప్రణాళికలు చేస్తాం. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పటిష్టపరచిన పాపాన పోలేదు. వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కింద సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాం. ఉపాధి హామీ కింద ఇప్పటి వరకు రూ. 9,597 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వంలో లబ్దిదారులు ఎవరో కూడా తెలియకుండా చేశారుఈ రోజు జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎకరం 30 సెంట్ల నేలలో 6 సెంట్లలో చెరువు, రెండు సెంట్లలో గట్టు ఉండే విధంగా నిర్మిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఎవరు లబ్దిదారులో కూడా తెలియనంతగా అవకతవకలకు పాల్పడ్డారు. ఈ రోజు పుడిచర్ల గ్రామానికి చెందిన రైతు శ్రీ సూర రాజన్నకు చెందిన భూమిలో ఫామ్ పాండ్ కి భూమి పూజ చేశాం. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీలు లబ్ది పొందుతున్నార. గ్రామాల్లో పనులు లేక నలిగిపోతున్నవారికి ఉపాధి కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పథకానికి కావాల్సిన అర్హత కష్టపడి పని చేయడమే. రాయలసీమను రతనాలసీమగా మార్చడమే కూటమి లక్ష్యంరాయలసీమలో నేల స్వభావాన్ని బట్టి ఇక్కడ నీటికి కటకట ఉంటుంది. వర్షం వచ్చినా నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. శ్రీ కృష్ణ దేవరాయలవారి హయాం మాదిరి రాయలసీమ రతనాలసీమ కావాలి. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. సీమకు పెద్ద పెద్ద ప్రాజెక్టులు వచ్చేలోపు రైతుల సౌలభ్యం కోసం ఫామ్ పాండ్స్ నిర్మిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల పాండ్లు మే నెలాఖరు లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొత్తం పాండ్లు పూర్తయితే ఒక టీఎంసీ నీటి నిల్వకు అవకాశం ఉంటుంది. రైతులంతా బాగుండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పంట పొలాల్లో సేద్యపు నీటి కుంటల ఏర్పాటును ముందుకు తీసుకువెళ్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒకే రోజు 13, 326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాం. చంద్రబాబు నాయుడు అనుభవాన్ని ప్రేరణగా తీసుకుని ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించడంతో పాటు అభివృద్ధి పనుల జాబితా తీసుకోవడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాం. గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో జాతీయ దినోత్సవాల సమయంలో జెండా పండుగ చేయడానికి రూ. 100 నుంచి రూ. 250 వరకు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఆ ఖర్చుని రూ. 10 వేల నుంచి 25 వేలకు పెంచింది. పంచాయతీరాజ్ శాఖలో సమర్థవంతమైన పాలన అందించేందుకు పునర్నియామకాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నరేగా నిధుల ద్వారా గ్రామాల్లో 97.44 మంది ఉపాధి కూలీలకు వారి గ్రామాల్లోనే ఉపాధి అందించాం. రూ. 6 వేల కోట్లు నేరుగా కూలీలకు అందించి ఉపాధితోపాటు ఆర్థిక స్థిరత్వం కల్పించే దిశగా అడుగు ముందుకు వేశాం. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 8 నెలల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించాం. వంద మందికి పైగా నివసిస్తున్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యాలు కల్పించాం. డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలు చూడాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో జన్మన్ పథకం కింద విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించాం. ఎంపీడీవోల సమస్యలు మా దృష్టికి తెచ్చారు మీ సమస్య పరిష్కారం వెతుకుతాం. పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్.. గ్రామ సచివాలయం, ఇంజినీరింగ్ అసోసియేషన్ సమస్యలకు పరిష్కారం వెతుకుతాం. వాల్మీకి బోయ సంక్షేమ సంఘం నుంచి అర్జీ వచ్చింది. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంది. ముఖ్యమంత్రి గారితోనూ, కేబినెట్లోనూ మీ సమస్యపై మాట్లాడుతాను. రెడ్డి సంఘం నాయకులు కర్నూలు విమానాశ్రయానికి స్వతంత్ర సమరయోధులు శ్రీ ఉయ్యాలవాడ సరసింహారెడ్డి పేరు ప్రతిపాదించారు. దాన్ని ముందుకు తీసుకువెళ్తాం. నేను కులాలు మతాల గురించి మాట్లాడితే చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. నేను ధర్మాన్ని మాత్రం బలంగా పాటిస్తాను. నా స్వధర్మాన్ని పాటిస్తాను. అన్ని ధర్మాలను గౌరవిస్తాను. గాజుల బలిజలు బీసీ డి లో చేర్చమని అడిగారు. మీకు న్యాయం జరిగేలా కృషి చేస్తాను. బుడగ జంగాలకి స్వతంత్ర్య అనంతరం కుల ధృవీకరణ కూడా లేకుండాపోయింది. వారికి న్యాయం చేస్తాం.అన్ని గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్థానిక శాసనసభ్యుల కోరిక మేరకు అభివృద్ధి పనులు ముందుకు తీసుకువెళ్తాం. పరిమితి మేరకు ప్రణాళికలు రూపొందించుకుని పూర్తి చేస్తాం. ఉపాధి హామీ బకాయిలు రెండు రోజుల్లో జమ అయ్యేలా చూస్తాం. అవసరం అయితే ఈ విషయంపై ముఖ్యమంత్రితో మాట్లాడుతాం. కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గతంలో చెప్పాను. ఆ గ్రామ అవసరాలు తీర్చేందుకు సొంత ట్రస్ట్ నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పిస్తాం. ప్రభుత్వం పథకాల ద్వారా చేయదగిన పనులు అధికారులతో మాట్లాడి పూర్తి చేస్తాం. కొణిదెల గ్రామంతోపాటు అన్ని గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తాం. ఒక్కో జిల్లాలో రెండు నుంచి మూడు రోజులు ఉండి ప్రజల సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తాం" అన్నారు. తలకు పాగా చుట్టి.. గడ్డ పార చేతబట్టిపంట పొలాల్లో సేద్యపు నీటి కుంటల (ఫామ్ పాండ్) ప్రారంభోత్సవానికి కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, పుడిచర్లకు వచ్చిన ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్వయంగా ఫామ్ పాండ్ తవ్వకానికి శ్రీకారం చుట్టారు. సొంత వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయం అలవాటు ఉన్న ఆయన తలకు పాగా చుట్టి రైతుగా మారిపోయారు. గడ్డపార చేతబట్టి శంకుస్థాపనకు సిద్ధం చేసిన ప్రాంతంలో గణపతిని పూజించి కుంట తవ్వకాన్ని ప్రారంభించారు. గడ్డపారతో గుంత తవ్వి స్వయంగా మట్టిని పారతో ఎత్తి గంపలో వేశారు. ఉపాధి కూలీలతో కలసి పనిలో పాలు పంచుకోవడంతోపాటు వారందరినీ వేదిక మీదకు పిలిచి లబ్ధిదారులుగా పరిచయం చేశారు.ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి, పాణ్యం శాసనసభ్యురాలు గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు శాసన సభ్యులు గిత్తా జయసూర్య, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా, మాజీ జడ్పీ చైర్మన్, టిటిడి బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


**ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్రను విద్యార్థుల పాఠ్యాంశాలలో చేర్చాలని వినతి వినతి పత్రం ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు సమర్పించిన ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బిర్రు ప్రతాపరెడ్డి, తూముకుంట ప్రతాపరెడ్డి**



ఓర్వకల్, మార్చి 22 (శ్రీచక్ర): పాణ్యం నియోజకవర్గము పూడిచర్ల గ్రామానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలిసి శనివారం వినతి పత్రం సమర్పించామని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష , కార్యదర్శులు బిర్రు ప్రతాపరెడ్డి, తూముకుంట ప్రతాప్ రెడ్డిలు తెలుపుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పదిలం కావాలని,అమర వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలవాలి. భారత స్వాతంత్ర్య పోరాటంలో తొలి వీరులలో ఒకరైన నరసింహారెడ్డి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, అలాగే కర్నూలు ఎయిర్పోర్ట్కు ఆయన పేరు పెట్టాలని కోరుతూ, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి వినతిపత్రం సమర్పించడం జరిగిందని తెలిపారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి బ్రిటిష్ పాలకుల దమనకాండనుఎదుర్కొనితనప్రాణాలనుతృణప్రాయంగాఅర్పించిన మహనీయుడు. అలాంటి వ్యక్తిత్వాన్ని మన భవిష్యత్ తరాలకు చేరువ చేయడం మన బాధ్యత" అని పేర్కొన్నారు. ఈ వినతిపత్రం సమర్పణలో నంద్యాల పార్లమెంటు సభ్యురాలు బైరెడ్డి శబరి, పాణ్యం శాసన సభ్యురాలు గౌరు చరితారెడ్డిలు,రెడ్డిసంఘంప్రతినిధులు,వివిధరాజకీయ, సామాజిక నాయకులు,చరిత్రప్రేమికులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అభ్యర్థనను స్వీకరించి తగినచర్యలు తీసుకుంటుందని సంఘం సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## హైకోర్టు జడ్జిను మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్, ఎస్పీ..

)మార్చి 22 కర్నూలు జిల్లా ప్రతినిధి..నగరం లోని స్టేట్ గెస్ట్ హౌస్ లో హైకోర్టు జడ్జి, కర్నూలు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.ఎన్. భానుమతిని మర్యాదపూర్వకంగా కలిసిన కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి,జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా,ఎస్పీ విక్రాంత్ పాటిల్.





## ఉప ముఖ్యమంత్రి వర్యుల ఆదేశాల మేరకు వికలాంగత్వంతో బాధపడుతున్న ముగ్గురు పిల్లలకు తక్షణ ఆర్థిక సహాయం

**ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందచేసిన జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**






కర్నూలు మార్చి 22: (శ్రీచక్ర): ఉప ముఖ్యమంత్రి వర్యుల ఆదేశాల మేరకు వికలాంగత్వంతో బాధపడుతున్న ముగ్గురు పిల్లలకు తక్షణ ఆర్థిక సహాయం అందచేశారు.. ఒక్కొక్కరికి రూ.50 వేలు చొప్పున ఆర్థిక సహాయం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అందచేశారు. శనివారం ఓర్వకల్లు మండలంలోని పూడిచెర్ల గ్రామ పరిధిలో ఫారం పాండ్ నిర్మాణ పనులను ప్రారంభించి, బహిరంగ సభ నిర్వహించిన సమయంలో వికలాంగత్వంతో బాధపడుతున్న తమ పిల్లలను ఆదుకోవాలని, సాయం చేయాలని బాధిత కుటుంబాలు ఉపముఖ్యమంత్రికి విన్నవించుకోగా, వారు వెంటనే స్పందించి, ఆర్థిక సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ను ఆదేశించారు. ఎమ్మిగనూరు మండలం, పరమాన్ దొడ్డి గ్రామ నివాసి గొల్ల లక్ష్మన్న, గొల్ల జయమ్మ దంపతుల కుమార్తె శ్రావణి పుట్టుకతో మానసిక వైకల్యంతో బాధ పడుతూ, 14 సంవత్సరాల వయస్సు వచ్చినా, మంచానికే పరిమితం అయి, బాలిక లో ఎదుగుదల లేక అనారోగ్యంతో ఉందని, చిన్న టీ కొట్టుతో జీవనం సాగిస్తున్నామని, ఆదుకోవాలని కోరి అర్జీ సమర్పించారు. ఓర్వకల్లు మండలం బైరాపురం గ్రామ నివాసి భాస్కర్, లక్ష్మి దంపతులకు ఉన్న నలుగురు పిల్లలలో జ్యోతి, చందు ఇద్దరూ పుట్టుకతో వికలాంగులని, ఆర్థిక సహాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ రెండు కుటుంబాల పిల్లలను చూసి, చలించి, అనారోగ్యంతో ఉన్న పిల్లలను ఆదుకునేందుకు తక్షణ ఆర్థిక సహాయం చేయాలని ఉప ముఖ్యమంత్రి జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.. వారి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వెంటనే వారిని పిలిపించి ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున రెండు కుటుంబాలకు చెందిన ముగ్గురు పిల్లలకు చెక్కులను అందించారు. మా బాధలు విని వెంటనే ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఉపముఖ్యమంత్రికి, జిల్లా కలెక్టర్ కు, రాష్ట్ర ప్రభుత్వానికి గొల్ల లక్ష్మన్న, భాస్కర్ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జీవన నైపుణ్యాలపై అవగాహన సదస్సు





మార్చి 22 ఎమ్మిగనూరు..స్థానిక సెయింట్ జాన్స్ ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథ కం ఎన్ఎస్ఎస్ చిన్మయ మిషన్ వారి ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలు" అనే అంశం పై అవ గాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా. చిన్మయ మిషన్ (ప్రెసి డెంట్ (బ్రహ్మచారి. నారాయణ చైతన్య మాట్లాడు తూ ప్రతి విద్యా ర్థి జీవన నైపుణాలు, ఆలోచనా విధానం ద్వా రా. వ్యక్తి గత అభివృద్ధి సాధించి. సమాజ సేవకు. ఉపయోగ పడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రసిపాల్ డాక్టర్ ఎన్ ఎం. వాగేష్ (ప్రతి విద్యార్థి చదువులో పాట, వ్యక్తిగత, సామాజిక మరియు వృత్తి పరమైన నైపుణ్యాలు పెంపొదిం చుకోవాలిని సూచించారు. ఈ కార్య క్రమంలో ఫార్మసీ కళాశాల (పిన్సిపాల్ డా. (శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్.ఎం. వాగేష్ డే ఎన్ఎస్ఎస్ అధికారులు,బి. రాజశేఖర్,సి. వెంకటేష్,డి. అనంత (ప్రసాద్ కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# నగరంలో పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్లు

**ముఖ్యమైన మూడు ప్రాంతాల్లో ఏర్పాటు**
**ఆదివారం సైతం కౌంటర్లు తెరిచే ఉంటాయి**
**నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు**



కర్నూలు, మార్చి 22 (శ్రీచక్ర): నగరపాలక సంస్థకు సంబంధించి ఆస్తి పన్ను, తాగునీటి కొళాయి చార్జీలను ప్రజలు సులువుగా చెల్లించేందుకు నగరంలోని ముఖ్యమైన మూడు ప్రాంతాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు కమిషనర్ యస్.రవీంద్ర బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, ఇప్పటికే క్షేత్రస్థాయిలో సిబ్బంది విస్తృతంగా తిరుగుతూ, పన్ను వసూళ్లను వేగవంతం చేసినట్లు వెల్లడించారు. నగరపాలక కార్యాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పన్ను వసూలు కేంద్రాలు ఆదివారం సైతం తెరిచే ఉంటాయని, ప్రత్యేక కౌంటర్లలో ఉదయం 7 నుండి రాత్రి 7 లోపు ప్రజలు తమ పన్నులను చెల్లించవచ్చన్నారు. అదేవిధంగా ప్రజలు ఇంటి నుంచే డిజిటల్ ప్లాట్ఫాంలలో పన్నులను చెల్లించవచ్చని, వాట్సాప్ నెంబర్ 9552300009, పురసేవ యాప్, వెబ్సైట్ ష్ట్రబిబిజూబ://ఇటఎజీ.జీజూ.ణనీల.తిని/వని/జూబిజూజీఎఎవనిబిబ లలో ఏదైనా ఒక పద్ధతిలో పన్నులను చెల్లించవచ్చని కమిషనర్ సూచించారు. ఒకవేళ నగదు రూపంలో చెల్లించాలనుకుంటే స్థానిక సచివాలయం, మీ సేవ, ఆన్లైన్ కేంద్రాలు, వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లలలో లేదా నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్నులు చెల్లించవచ్చని సూచించారు. ×ప్రత్యేక కౌంటర్లు ఇక్కడే1. కల్లూరు వార్డు కార్యాలయం – 85వ సచివాలయం, 2. జె.యన్.ఆర్. నగర్ (సి.క్యాంపు) – 62వ సచివాలయం, 3. బాలాజీ నగర్ – 104వ సచివాలయం.

## చీకళ్ల దిబ్బలో భూ ఆక్రమణ చేసిన ఆక్వా రైతులు

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక.కోటేశ్వరరావు**

కోట మార్చి 22 (శ్రీచక్ర ) : కోట మండలం అల్లంపాడు పంచాయతీలోని చీకలదిబ్బ గ్రామస్థులు గ్రామంలో ఎవరైనా చనిపోతే స్మశాన వాటికకు వెళ్ళనివ్వకుండా కొంతమంది ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కోట మండల తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు కు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట మండలంలోని అల్లంపాడు పంచాయతీకి చెందిన చీకళ్ల దిబ్బ గ్రామంలో కడల వాగు లోయను కొంతమంది ఆక్వా రైతులు ఆక్రమించి రైతులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు.కొంతమంది రైతులు ఆక్వా సాగు చేయలేని పక్షంలో పంట పొలాలు వేసుకున్నారని,వరి పైరు కోతకు వచ్చిన సమయంలో ఆక్వా రైతులు వారి పైన కోత కోయనికుండా అడ్డుకుంటున్నారని తెలిపారు.ఈ సమస్యపై కోట మండల తాహాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు.అనంతరం సానుకూలంగా స్పందించిన కోట మండల తాహాసిల్దార్ బాధితులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని ఈ సందర్భంగా పబాక.కోటేశ్వరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పులి.సురేష్,తదితర చీకళ్ళ దిబ్బ గ్రామస్థులు ఉన్నారు.

## జాతీయస్థాయి పెన్సింగ్ పోటీలకు ఎంపికైన వారిని అభినందించిన ఎమ్మెల్యే పులపర్తి.



భీమవరం మార్చి 22 (శ్రీ చక్ర) ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు కటక్ లో జరగనున్న జాతీయస్థాయి పెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శనివారం అభినందించారు. భీమవరం పెన్సింగ్ క్లబ్ కు చెందిన కె ప్రేట్లీ, మంతెన సమీక్ష, దంతులూరి వర్షిత్, బి శశి కార్తీక్ లు ఈనెల 2వ తేదీన కంచికచర్ల లో జరిగిన అండర్ -14 పెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కాకినాడలో జరిగిన అండర్ -17 పెన్సింగ్ పోటీల్లో పి రేవంత్ సిల్వర్ మెడల్ సాధించారని కోచ్ గుణ్ణం కృష్ణమోహన్ తెలిపారు. వారిని ఎమ్మెల్యే అంజిబాబు అభినందించారు.

## అంబేద్కర్ అవమానించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి



భీమవరం మార్చి 22( శ్రీ చక్ర ) తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి గుర్తు తెలియని దుండగులు చెప్పుల దండ వేసి అవమానించారని, ఇది నీచమైన పని అని బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ రాష్ట్ర నాయకులు కోనా జోసెఫ్ అన్నారు. శనివారం భీమవరం జేఏసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ ను అవమానించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ ఆదివారం జిల్లా భీమవరం అంబేద్కర్ సెంటర్లో అన్ని సంఘాలతో నిరసన తెలియజేస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నిరసనలో పాల్గొనాలని కోరారు. జెఏసి నాయకులు ఈది రవి కుమార్, కేసి రాజు, బేతాళ కమలాకర్, మీసాల జయరాజు, ఫిల్మ్ షేకర్, ఆధర్‌రాజు,కొండేటిరాజు, బాలం ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

## చెరువుల తవ్వకాలకు బ్రేక్...

కాకినాడ, మార్చి 22,ఒకప్పుడు ఆహ్లాదకరమైన సువిశాల సాగర తీరం ఉండేది. సునామీ, తుపాన్లు వంటి విపత్తుల నుంచి కాపాడేలా ఇసుక తెన్నెలు పుష్కలంగా కనపడేవి. కానీ ఇప్పుడు కనుచూపు మేరలో చెరువులే కనిపిస్తున్నాయి. తీరం వెంబడి పచ్చని గోడలా సరుగుడు తోటలతో గ్రీన్ బెల్ట్ ఉండేది. కానీ ఇప్పుడు మొత్తం ఆక్వా కాలుష్యంతో నిండిపోయింది. ఏకంగా సముద్రానికి ఆనుకుని మరీ చెరువులు తవ్వేయడం ఆందోళనకరంగా మారింది. ఈ అక్రమ కార్యకలాపాల వల్లనే సముద్రకోతకు గురి అవుతోంది. సీఆర్‌జడ్ పరిధి నానాటికీ ముందుకు చొచ్చుకు వచ్చే పరిస్థితి ఉత్పన్నమైంది. విచిత్రమేంటంటే సీఆర్‌జడ్ పరిధిలోకి వచ్చే ఈ ఆక్వా చెరువులకు ఎటువంటి అనుమతులు లేవు. అయినా ప్రభుత్వం అందించే సబ్సిడీ విద్యుత్తు సరఫరా పుష్కలంగా లభిస్తోంది. ఆక్వా చెరువుల దందాపై కొందరు జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. దీంతో గ్రీన్ ట్రైబ్యునల్ సభ్యులు అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండల పరిధిలోని అంతర్వేదిలో పర్యటించారు. స్వయంగా అక్కడ జరిగే అక్రమాలను సభ్యులు పరిశీలించారు. తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. తీరం వెంబడి అక్రమంగా తవ్వేసిన ఆక్వా చెరువులను ధ్వంసం చేసి పూడ్చాలని ఆదేశించారు. లేకుంటే స్థానిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందించిన జిల్లా యంత్రాంగం ఆదిశగా చర్యలకు ఉపక్రమించింది.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో అంతర్వేది నుంచి తుని మండలం అద్దరిపేట వరకు సముద్ర తీరం విస్తరించి ఉంది.

# త్వరలో కల్వర్టు పనులు పూర్తి చేస్తాం

**గూడూరు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంత్రులను కలిసి ప్రతిపాదనలు అందజేశాం**
**తిరుపతి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్**





కోట మార్చి 22 (శ్రీ చక్ర) : కోట పట్టణంలోని ఎక్స్రా మార్ట్ ప్రక్కనే ఉన్న కల్వర్టు,అదేవిధంగా హీరో హోండా షోరూం పరిధిలో ఉన్న కలవర్టను కోటి 21 లక్షల రూపాయలతో త్వరలో పనులు చేపట్టబోతున్నట్లు షేక్.జలీల్ అహ్మద్ తెలిపారు.ఈ సందర్భంగా శనివారం షేక్.జలీల్ అహ్మద్ మాట్లాడుతూ కల్వర్ట్ ల నిర్మాణానికి గూడూరు ఎమ్మెల్యే పాశం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని గుర్తు చేస్తూ ప్రతిపాదనలు వచ్చిన తక్షణమే పనులు చేపడతామన్నారు.అంతేకాకుండా గూడూరు డివిజన్ స్థాయిలో కోట,వాకాడు,చిట్టమూరు గ్రామాల్లో ఉండే ముస్లిం సోదరుల కొరకు బరియల్ గ్రౌండ్ (స్మశాన వాటిక) నిర్మాణం కొరకు పనులు జరిగేలా ఏర్పాటు చేస్తామని తెలియజేశారు.అదేవిధంగా గోవిందపల్లి పాలెంలో వరదలు వస్తే అధిక వరదప్రవాహంతో గ్రామస్థులు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలిసిందే.ఈ సమస్యను కూడా ఎమ్మెల్యే, మంత్రులు ద్రుష్టి కి తీసుకెళ్లి గ్రామ ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కొరకు ప్రతిపాదనలు అందజేశామని చెప్పారు.

## ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి కన్వర్జెన్స్ సమావేశం







వీరవాసరం మార్చ్ 22 (శ్రీచక్ర )వరి చేలో కోత కోసే ముందర పదును ఉన్నప్పుడు నవధాన్యాలు చల్లడం వల్ల భూమి సారవంతం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి కన్వర్జెన్స్ సమావేశం వీరవాసరంలో మండల సమైక్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో విత్తనాలకు కావలసిన నిధులు సేకరణ, వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2025-26 పై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. నవధాన్యాలు వేయడం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని చెప్పారు. ఒక్కొక్క మొక్క వేర్లు ఒక రకం బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుందని మొక్కల పెరుగుదలకు ఈ సూక్ష్మజీవులు ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం ఏడిఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆర్ఎక్స్ కె సిబ్బంది ప్రతి గ్రామంలో రైతులందరి చేత నవధాన్యాలు వేయించాలని చెప్పారు. ఏవో బిన్సీ బాబు మాట్లాడుతూ ప్రతి రైతు నవధాన్యాలు వెయ్యాలని తెలిపారు. ఏపీఎం జ్యోతి రాణి మాట్లాడుతూ.. నవధాన్యాలు తేవడానికి సిబ్బంది యొక్క సంఘాల నుండి లోన్ ఇవ్వడానికి సహకరిస్తామని చెప్పారు. పకృతి వ్యవసాయ అనుభవాలను సమావేశంలో చర్చించారు. డివిజన్ చార్జెస్ స్వామి, మండల ఇంచార్జ్ దేవి నాగరాజు, యూనిట్ ఇంచార్జ్ వినోద్ కుమార్, సిసి పద్మావతి, సీఏలు, విఏఏలు, ఐ సి ఆర్ పి లు పాల్గొన్నారు.

## బోసు ను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి...మాజి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు





జీలుగుమిల్లి మార్చి 22 శ్రీ చక్ర మండలం లోని తాటియాకుల గూడెం గ్రామంలో ఇటివల వైసిపి నాయకుడైన గంధం.బోసు ను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని పోలవరం మాజి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హంతకుల చేతిలో మృతి చెందిన బోసు కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సంధర్బంగా బోసు చిత్రపటానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు.అనంతరం బాలరాజు మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల దాడి లో బోసు తీవ్రంగా గాయపడి మృతి చెందడం పార్టీ కి తీరని లోటని అన్నారు.హత్య చేసిన వారిని ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో వైసిపి మండల అధ్యక్షులు సందా.ప్రసాద్,ఎంపిటిసి సున్నం.సురేష్,బోధ.శ్రీనివాస్,నాయకులు కుంజా.రాముడు,సత్యనారాయణ,రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**మంత్రి వాసంశెట్టి సుభాష్.**





రామచంద్రపురం, మార్చి 22(శ్రీచక్ర)సమాజాన్ని పట్టి పీడిస్తున్న క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం సాయంత్రం వివిధ గ్రామాల నుంచి వచ్చిన క్యాన్సర్ వ్యాధి బాధితులు, వారి సహాయకులుతో మంత్రి సుభాష్ తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్యాన్సర్ వ్యాధి పట్ల ఎవరు భయపడవద్దని, మనోధైర్యంతో వ్యాధిని ఎదుర్కోవాలన్నారు. వ్యాధి తీవ్రతను బట్టి మెరుగైన వైద్య సేవలు, అవసరమైన మందులు గుంటూరులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో వైద్య సేవలు అందేలా ఇప్పటికే వైద్యులతో మాట్లాడామని, బాధితులు ముందుకొస్తే ఉచితంగా వైద్యం, మందులు అందిస్తామన్నారు. రామచంద్రపురం కెవిఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ నాగ సతీష్ కుమార్ కోట మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఏటా క్యాన్సర్ తో 70 వేలమంది చని పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు మామోగ్రఫి, పాప్ స్మియర్ పరీక్షలు, పురుషులు కొలనోస్కోపీ పరీక్షలు ముందుగా చేయించుకుని క్యాన్సర్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 8 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉన్న అమ్మాయిలు సర్వావాక్ వ్యాక్సిన్ ముందస్తుగా తీసుకుంటే క్యాన్సర్ ను రాకుండా అడ్డుకోవచ్చు అన్నారు. నిరంతరంగా దగ్గు, శ్వాస ఆడక పోవడం, బరువు తగ్గడం, అలసట, గడ్డలు, మల మూత్రాలలో రక్తం పడడం,నోటిలో పుండ్లు, తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుని వద్దకు వెళ్లాలని సూచించారు. మంచి ఆహారపు అలవాట్లు, రోజువారి వ్యాయామం, ఒత్తిడి లేని జీవితం అలవర్చుకోవడం ద్వారా క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు. వ్యాధి బాధితుల వివరాలు నమోదు చేయడంతో పాటు, అవసరమైన కొన్ని మందులను ఉచితంగా మంత్రి తండ్రి, సత్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులుగా బర్ల...!





రామచంద్రపురం, మార్చి 22( శ్రీచక్ర)డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా శ్రీకృష్ణ యాదవ్ సంఘం నూతన అధ్యక్షులుగా రామచంద్రపురం నియోజకవర్గ బీసీవై పార్టీ ఇంచార్జ్ బర్ల శ్రీనివాస్ యాదవ్ ఏకగ్రీవంగా ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ఏర్పాటుచేసారు.తొలుత ప్రత్యేక సమావేశం అమలాపురం పట్టణ, కొంకాపల్లి ఎత్తు రోడ్డు మైదానంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బర్ల శ్రీనివాస్ యాదవ్ ని ఏకగ్రీవంగా నూతన జిల్లా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో యాదవ సామాజిక వర్గం రాజకీయ, సామాజిక అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పన, విద్య ఉద్యోగాల్లో ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టికి ఆకర్షించేందుకు కార్యచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. అలాగే యాదవ వర్గానికి రాష్ట్ర రాజకీయాల్లో సముచిత స్థానం లభించాలనే నినాదం తో బలోపేతం చేస్తూ, రాష్ట్ర స్థాయిలో ఒక ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేయాలనే అభిప్రాయాన్ని ఈసందర్భంగా కార్యవర్గ సభ్యులు వ్యక్తం చేశారు.డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నూతన కార్యవర్గం జిల్లా గౌరవాధ్యక్షులుగా అమలాపురం నియోజకవర్గం చెందిన కోరశిఖ వీర వెంకట సుబ్రమణ్యం జిల్లా అధ్యక్షులుగా రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన బర్ల శ్రీనివాస్ యాదవ్ (రామచంద్రపురం నియోజవర్గం బీసీవై పార్టీ ఇంచార్జ్ ) జిల్లా ఉపాధ్యక్షులు: మందపాటి వెంకటేశ్వరరావు ( రాజోలు నియోజకవర్గం) జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండుమేను ప్రసన్న మణికంఠ స్వామి ( రాజోలు నియోజకవర్గం )జిల్లా యువజన అధ్యక్షు లుగా మందపాటి బాలు యాదవ్ గా (ముమ్మిడివరం నియోజవర్గం )యువజన ఉపాధ్యక్షులు గా ఆమజాల శ్రీను (మండపేట నియోజకవర్గం )జిల్లా మహిళా అధ్యక్షురాలుగా చేకూరి శ్రీలక్ష్మి (రామచంద్రపురం నియోజవర్గం)జిల్లాసలహాదారులుగా చిట్టిమేను వీరవెంకట సత్యనారాయణ ( గన్నవరం నియోజవర్గం)జిల్లా సహాయ-సలహాదారులుగా భయ్యా రాంబాబు (కొత్తపేట నియోజకవర్గ )జిల్లా కోఆర్డినేటర్గా ఆమజాల శ్రీనివాస్ యాదవ్ (రామచంద్రపురం నియోజవర్గం )జిల్లా కన్వీనర్గానూని రామకృష్ణ ( గన్నవరం నియోజవర్గం )జిల్లా కో -కన్వీనర్గా మట్ట సోమరాజు ( కొత్తపేట నియోజకవర్గం) జిల్లా సంయుక్త కార్యదర్శిగా సూరిబోయిన సుబ్రమణ్యం (గన్నవరం నియోజవర్గం )జిల్లా ట్రెజరర్గా పాశం చింతారావు (కొత్తపేట నియోజకవర్గ )జిల్లా కో ట్రెజరర్గాదండు బోయిన శ్రీనివాసరావు (మండపేట నియోజక వర్గం ) జిల్లా లీగల్ అడ్వైజర్గా ఉప్పల ప్రవీణ్ (రామచంద్రపురం నియోజవర్గం) జిల్లా విద్యా సాంకేతిక కన్వీనర్గా గుండు మేను శ్రీనివాస్ రావు (రాజోలు నియోజవర్గం ) జిల్లా ఉద్యోగ కన్వీనర్గా మల్లిపూడి రామకృష్ణ ( రామచంద్రపురం నియోజవర్గం )జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా కన్వీనర్గా కానుబోయిన దుర్గాప్రసాద్ ( అమలాపురం నియోజవర్గం)జిల్లా వ్యాపార, వాణిజ్య కన్వీనర్గా వంటపాటి మహేష్ ( గన్నవరం నియోజవర్గం జిల్లా వ్యవసాయ కన్వీనర్గాగుండుమేను సతీష్ ( రాజోలు నియోజవర్గం )జిల్లా ఆరోగ్య కన్వీనర్గా కోరశిక రామచంద్ర మూర్తి ( అమలాపురం నియోజకవర్గనీ )జిల్లా ఎన్నారై కన్వీనర్గా దండు మేను విజయ్ (ముమ్మిడివరం నియోజకవర్గనీ )జిల్లా వివాహ పరిచయ కన్వీనర్గా గోళ్ల శ్రీను ( మండపేట నియోజకవర్గ )జిల్లా సహాయ కార్యదర్శిగా మందపాటి రామకృష్ణ ( అమలాపురం నియోజకవర్గం )జిల్లా సహాయ కార్యదర్శిగా గాలి వీర వెంకట రాంబాబు ( గన్నవరం నియోజవర్గం )జిల్లా సహాయ కార్యదర్శిగా మన్నె వేంకటేశ్వర రావు , ( అమలాపురం నియోజవర్గం) జిల్లా సహాయ కార్యదర్శిగా వీరోతి కిరణ్ (మండపేట నియోజకవర్గ ) జిల్లా సహాయ కార్యదర్శినాగళ్ళ పుల్లయ్య ( ముమ్మిడివరం నియోజవర్గం) జిల్లా సహాయ కార్యదర్శిగా వంటపాటి వీరబాబు (కొత్తపేట నియోజక వర్గం) తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈకార్యక్రమంలో రామచంద్రపురం నియోజవర్గ యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారునియోజకవర్గం అధ్యక్షులు దాసరి శ్రీనివాస్ యాదవ్ పట్టణ అధ్యక్షులు కిలారపు బద్రీనాథ్, నూజివీడు రాంబాబు యూత్ ప్రెసిడెంట్ మండపేట, పట్టపగల రాంబాబు వైస్ ప్రెసిడెంట్ మండపేట, అమ్మజాల శ్రీను మండపేట సంఘం సభ్యులు మల్లిపూడి రామకృష్ణ, మట్ట మహేష్, గోనుమిల్లి తాతాజీ, మన్ని బద్రి, మల్లిపూడి అయ్యప్ప, తదితరులు పాల్గొని, నూతనంగా ఎన్నికైన సంఘానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, సంఘటిత శక్తితో మాత్రమే సమాజంలో మార్పు తీసుకురాగలం అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమాజానికి సేవ చేయడం, కొత్త తరం యువతకు దిశా నిర్దేశం చేయడం తమ ప్రధాన లక్ష్యమని వీరంతా తమతమ అభిప్రాయాలను తెలియజేశారు.

# సకాలంలో జలజీవన్ పనులు చేయక నిధులు వెనక్కి

**నామవానిపాలెం సర్పంచ్ భూపతి రాజు**
**సాగునీరు త్రాగునీరు సకాలంలో ఇవ్వాలి**
**పంట కాలవల్లోకి డ్రైనేజీ నీరు రాకుండా చూడండి**
**శిథిలావస్థకు చేరుకున్న కరెంటు స్తంభాలు మార్చండి**
**సభా మర్యాద కాపాడాకపోతే ఎలా :ఎంపీడీవో**






కాజులూరు, మార్చి 22(శ్రీచక్ర)తమ గ్రామానికి మంజూరైన జలజీవన్ నిధులు పనులు సకాలంలో చేయక సుమారు 20 లక్షల రూపాయలు వెనక్కిపోయాయని నామవారముపాలెం సర్పంచ్ భూపతి రాజు వెంకట సూర్యనారాయణ రాజు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కాజులూరు మండల సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీడీవో ఆధ్వర్యంలో ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హాజరైన పలువురు ప్రజాప్రతినిధులు తమ తమ గ్రామాల్లో ప్రజా సమస్యలపై అధికారులపై గళం విప్పారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన నామవానిపాలెం గ్రామ సర్పంచ్ భూపతి రాజు వెంకట సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ తమ గ్రామానికి 38 లక్షల రూపాయలు జలజీవన్ నిధులు మంజూరయ్యాయని పనులు సకాలంలో చేయకపోవడంతో 20,లక్షల రూపాయలు నిధులు వెనక్కి వెళ్లిపోయాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో గ్రామంలో వేసవి దృశ్య నీటి ఎద్దడి తప్పదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. అలాగే సమావేశంలో సాగునీరు త్రాగునీరు సకాలంలో అందించాలని పలువురు ప్రజాప్రతినిధులు సభలో అధికారులను కోరారు. రైతాంగానికి సాగునీరు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని , పొట్ట దశలో పుష్కలంగా నీరు ఉండవలసిన సమయానికి ఎక్కడిక క్కడ పొలాలు నెరలతీసి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే త్రాగునీరు విషయంలో కూడా పలుచోట్ల అంది అందని పరిస్థితి ఏర్పడుతుందని జగన్నాథగిరి గ్రామంలో అయితే త్రాగునీరు కొరత ఉందని ఎంపీటీసీ సభ్యురాలు కోప్పన లక్ష్మీ సభదృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా మండల పరిధిలో పలుచోట్ల గ్రామాల్లో గతంలో వేసిన ఎలక్ట్రికల్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకునే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితిలో ఉన్నామని వెంటనే స్తంభాల స్థానంలో కొత్త స్తంభాల మార్చాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరారు. సభలో పలువురు ఎంపీటీసీలు సర్పంచులు ప్రజా సమస్యలపై అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నామవానిపాలెం విషయంలో ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ మార్గంగా అందుబాటులో ఉన్న నిధులు వినియోగించుకోవాలని, సరిపోను పక్షంలో మండల పరిషత్ ఉంది ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే త్రాగునీరు విషయంలో ఎక్కడా రాజీ పడొద్దు అని మోటార్లు ఎక్కడుంటే అక్కడ పంచాయతీ, ఆర్డబ్ల్యూ ఎస్ అధికారులు సంయుక్తంగా కలిసితొలగించాలని ,ఎక్కడైనా అధికారులు మాట వినకపోతే కేసులు పెట్టడానికైనా సిద్ధంగా కావాలని ఆయన ఆదేశించారు కేవలం ఒక కుటుంబానికి 55 లీటర్ల త్రాగునీరు మాత్రమే వాడుకోవాల్సిఉండగా ఎవరికి వారు నచ్చిన రీతిలో డ్రమ్ములు , ట్యాంకులతో పూర్తి స్థాయిలో ఎక్కించుకోవడంతో ఈ కొరత ఏర్పడుతుందని ఆయన అన్నారు. కాజులూరు తాసిల్దార్ ఠాగూర్ మాట్లాడుతూ ప్రజలు రెవిన్యూ కి సంబంధించి ఫిర్యాదులు ఏమైనా ఉంటే సమీప సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సచివాలయంలో సుమారు 500 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన సూచించారు. ప్రతి విషయానికి అధికారుల చుట్టూ తిరగాల్సి పనిలేదని ఆయన తెలిపారు .అలాగే ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం కార్యక్రమంలో నేరుగా కాజులూరు తాసిల్దార్ కార్యాలయానికి ఫిర్యాదు చేసుకోవచ్చని సూచించారు.సభ మర్యాద కాపాడకపోతే ఎలా: ఎంపీడీవో. సమావేశంలో పలువురు సెల్ ఫోన్లుతో సభలో మాట్లాడుతుంటే ఎంపీడీవో జె.రాంబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా మర్యాదను కాపాడుతూ కాపాడవలసిన మీరే ఇలా చేయడం సబబు కాదని ఎవరైనా మాట్లాడదల్చుకుంటే బయటకు వెళ్లిపోవాలని ఆయన సూచించారు. అలాగే సమావేశంలో ఒకరి తర్వాత ఒకరు కు మాట్లాడే అవకాశం ఉంటదని అందరూ మూకుమ్మడిగా మాట్లాడవద్దని సూచించారు. ఈ సమావేశంలో మండల స్థాయి ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు హాజరయ్యారు.

# ఐదవ సెమిస్టరు ఫలితాల్లో సత్తా చాటిన మోడ్రన్ డిగ్రీ విద్యార్థులు.






రామచంద్రపురం, మార్చి 22( శ్రీ చక్ర)ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఐదవ సెమిస్టరు ఫలితాల్లో రామచంద్రపురం పట్టణం లయన్ జి. వి.రావు మోడరన్ డిగ్రీ కాలేజీ బి.ఎస్.సి. విద్యార్థులు అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించి యూనివర్సిటీ టాపర్స్ గా నిలిచారు. ఈ ఫలితాల్లో 28మంది విద్యార్థులు 9 నుండి 9.8 గ్రేడ్ పాయింట్స్ సాధించడం విశేషం. ఈ సందర్భంగా శనివారం అందుబాటులో ఉన్న విద్యార్థులతో మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్లయన్ జి వి రావు మాట్లాడుతూ తమ విద్యార్థులు 28 మంది ఈ ఘనత సాధించియూనివర్సిటీటాపర్స్గానిలవడం చాలా అభినందనీయమైన విషయం అని అన్నారు. అభినందన సభలో సుమారు 15 మంది విద్యార్థులు పాల్గొన్నారని, మిగతా విద్యార్థులు వివిధ రాష్ట్రాల్లో ఇంటర్న్ షిప్, పీజీ కోర్సులు అధ్యయనం చేస్తున్నారని పేర్కొన్నారు. డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రణాళికబద్ధమైన అకాడమిక్ షెడ్యూల్, అత్యుత్తమ బోధన తమ విద్యార్థులు టాపర్స్ గా నిలవడానికి దోహదం చేశాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టాపర్స్ ని మోడరన్ డిగ్రీ కాలేజ్ అకాడమిక్ డైరెక్టర్ కె. సాయిరాం చౌదరి, అధ్యాపక బృందం అభినందించారు.

# రసా బసాగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం. అధికారులను నిలదీసిన సభ్యులు





రామచంద్రపురం ,మార్చి 22( శ్రీచక్ర)రామచంద్రపురం పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశంలో పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించడంతో రసాభాసగా కొనసాగింది.డాక్టర్ చెలికాని రామారావు మెమోరియల్ కౌన్సిల్ హాల్ నందు శనివారం సమావేశం నిర్వహించారు చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ వార్డులకు సంబంధించి మౌలిక సదుపాయాల కల్పనపై కౌన్సిలర్ల మధ్య చర్చ హోరాహోరిగా కొనసాగింది. ఈనాటి కౌన్సిల్లో 20 అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టడం జరిగింది. సమావేశంలో మొదటి అంశ మైన వెల్ల వాటర్ ట్యాంకుకు 5 లక్షల అంచనా వ్యయంతో 40 హెచ్ పి, 50 హెచ్ పి కిర్లోస్కర్ మోటార్లను సరఫరా చేసి బిగించే అంశం పై తీర్మానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. దాంతో సభలో తీవ్ర గందరగోళం మొదలైంది. దీనిపై కౌన్సిల్ సభ్యులంతా ఏకకంఠంతో స్పందించారు. కౌన్సిలర్లు వాడ్రేవు సాయి ప్రసాద్ పెంటపాటి దేవి, గుబ్బల గణ, వైస్ చైర్మన్ శివాజీ, కో ఆప్షన్ సభ్యులు ఎల్ఐసి మస్తాన్ తదితరులు వివిధ వార్డుల్లో వైరల్ అవుతున్న రక్షిత మంచినీటి సమస్యపై తీవ్రంగా స్పందించారు. వెల్ల వాటర్ ప్రాజెక్టు నుంచి మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న రక్షిత మంచినీటిపై పట్టణ వాసులనుంచి తీవ్ర అభ్యంతరాలు ఎదురవుతున్నాయని కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. వివిధ వార్డుల్లో రంగు మారిన నీళ్లు వస్తున్నాయంటూ పట్టణ ప్రజలు పలువురు ప్రజా ప్రతినిధులమైన తమకు ఫిర్యాదు చేస్తున్నారని, అధికారులు ఏమీ పట్టనట్లు ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధంగా రక్షిత మంచినీటిపై జరిగిన చర్చ కాస్తా కొద్దిసేపట్లోనే రచ్చగా మారింది. దాంతో అధికారుల్లో వేసవి తాపం మొదలైంది. దానికి డిఇ శ్రీకాంత్ బదులిస్తూ తాను వాటర్ ప్లాంట్ ను ప్రతిరోజు పర్యవేక్షిస్తున్నానని, ఆ వాటర్ లో ఆక్సిజన్ తగ్గడమే రంగు మారినట్లు ఉంటుందని అన్నారు. డి ఇ సమాధానం తో సంతృప్తి కానీ సభ్యులు దీనిపై తీవ్ర వాగ్వాదానికి దిగారు. దాంతో ఈ అంశంపై మున్సిపల్ అధికారులు ఈ ఈ, ఎస్ఇ ని సంప్రదిస్తామని వివరణ ఇచ్చారు. దాంతో సమావేశం సద్దుమణిగింది. 13వ అంశంగా ప్రవేశపెట్టిన వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాన్ని దీనిలో చాలానే అవకతవకలు జరిగాయని సభ్యులంతా సభ్యులంతా ముక్తకంఠంతో తిరస్కరించారు.

# టీడీపీ గూటికి రాపాక



విజయవాడ, మార్చి 22, జనసేన పార్టీ తొలి ఎమ్మెల్యేగా నెగ్గి తెలుగు రాష్ట్రాల్లో ఒక్కసారిగా గుర్తింపు పొందిన రాజోలు మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ప్రస్తుతం దారెటు..? ఆయన ఏ పార్టీ వైపు చూస్తున్నారు. ఇప్పుడు కోనసీమలో ఇదే చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఆయన కదలికలు గమనిస్తున్న పలువురు ఆయన టీడీపీ నాయకులతో టచ్‌లో ఉన్నారననే టాక్ ఆసక్తిగా మారింది. రాజోలు నియోజకవర్గంలో టీడీపీకి సరైన నాయకుడు లేకపోవడం ఈ ప్రచారనికి మరో కారణంగా కనిపిస్తోంది. రాజోలులో వ్యక్తిగత ఓటు బ్యాంకు కలిగిన నాయకునిగా గుర్తింపు ఉన్న రాపాక వరప్రసాదరావుకు ఇప్పుడు ఇదే అంశం కలిసొచ్చే అవకాశాలున్నాయని పొలిటికల్ సర్కిల్‌లో చర్చ జరుగుతోంది. రాజోలు నియోజకవర్గంలో టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న గొల్లపల్లి సూర్యారావు మొన్నటి సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీకి షాకు ఇచ్చి వైసీపీలో చేరి టిక్కెట్టు దక్కించుకున్నారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో జనసేన పార్టీకి ఏకైన ఎమ్మెల్యేగా గెలుపొందిన రాపాక జనసేనకు షాక్ ఇచ్చి వైసీపీలో గూటికి చేరారు. 2024లో వైసీపీ టికెట్టు తనదే అనుకున్న సమయంలో ఎన్నికలకు ముందు వైసీపీలో చేరిన గొల్లపల్లికి అసెంబ్లీ టికెట్టు ఇచ్చి రాపాకకు వైసీపీ షాక్ ఇచ్చింది. అయితే అమలాపురం ఎంపీ టికెట్టు ఇచ్చినా అయిష్టతతోనే ఆయన పోటీలో ఉండాల్సిన పరిస్థితి తలెత్తింది. ఎన్నికల అనంతరం ఆయన జగన్‌పై తీవ్ర విమర్శలు చేస్తూ వైసీపీకు గుడ్‌బై చెప్పారు. గొల్లపల్లి వైసీపీకి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి రాజోలులో టీడీపీకి నాయకుడు లేడు. ఇప్పుడు రాపాక చూపులు టీడీపీ వైపు పడటం వెనుక కారణమిదే అంటున్నారు. రాజోలులో టీడీపీకి ఇంచార్జ్ లేకపోవడం రాపాకకు కలిసొచ్చే అంశమని, రాపాక రాకకు మార్గం సుగమం అవుతుందంటున్నారు. మొన్నటి సాధరణ ఎన్నికల తరువాత వైసీపీకి గుడ్‌బై చెప్పిన రాపాక వరప్రసాదరావు టీడీపీ కీలక నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు తదితరులను కలిసినట్లు టాక్. ప్రస్తుతం రాపాక ఎటూ వెళ్లక సైలెంట్‌గా ఉన్నా కూడా ఆయన మాత్రం టీడీపీలోకి చేరేందుకు అన్ని ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారని మాత్రం స్థానికంగా తీవ్రంగా చర్చజరుగుతోంది..

# రాధా... రాం...రాం..

విజయవాడ, మార్చి 22, వంగవీటి రాధా.. ఈ పేరు ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో చాలా ఫేమస్. అందుకు కారణం ఆయన తండ్రి రంగా. కాపుల కోసం ఎన్నో ఉద్యమాలు చేసిన రంగా.. దారుణ హత్యకు గురయ్యారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చిన రాధా.. ఒక్కసారి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత ఏ పదవీ రాలేదు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే రాజకీయ రాజధాని విజయవాడ. అలాంటి బెజవాడలో రాజకీయంగా చక్రం తిప్పింది వంగవీటి కుటుంబం. వంగవీటి రాధా (రంగా సొదరుడు) హత్య తర్వాత విజయవాడ రాజకీయం పూర్తిగా మారిపోయింది. రంగా ప్రవేశంతో వేడెక్కింది. 1985లో రంగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో.. రంగా జైలుకు వెళ్లాల్సి వచ్చింది. రంగా జైల్లో ఉండగానే.. 1988 జులై 10న జరిగిన కాపునాడు సభలో ఆయనను తమ నాయకుడిగా ఎన్నుకున్నారు. ఆ తర్వాత జైలు నుంచి విడుదలైన రంగా.. జనచైతన్య యాత్ర చేసి ఎన్.టి.రామారావు ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. పోలీసులు ఆధిపత్యం చెలాయిస్తున్నారని పోరాడారు. పేదల కోసం, బలహీన వర్గాల కోసం ఆయన అనేక ఉద్యమాలు చేశారు. విజయవాడలోని గిరిపురంలోని పేదల ఇళ్ల పట్టాల కోసం ఆయన నిరాహార దీక్ష చేశారు. కాపు సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు ప్రయత్నించారు. 1988 డిసెంబర్ 26న పేదల ఇళ్ల పట్టాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న రంగాను.. ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. ఆయన హత్య తర్వాత కోస్తాంధ్రలో పెద్ద ఎత్తున హింస చెలరేగింది. కేసులు, అరెస్టులు, గొడవలు, ధర్నాలు జరిగాయి. చాలా రోజుల తర్వాత రంగా కుమారుడు రాధా రాజకీయ రంగప్రవేశం చేశారు. 2004లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆ తర్వాత చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీలో చేరారు2009లో విజయం దక్కలేదు. ఆ తర్వాత కొన్నాళ్లకు జగన్ సారథ్యంలోని వైసీపీలో చేరారు వంగవీటి రాధా. 2014లోనూ అదృష్టం వరించలేదు. 2019 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అప్పుడు ఎక్కడా పోటీ చేయలేదు. పార్టీ అధికారంలోకి వస్తే.. ఎమ్మెల్సీ పదవి ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ.. టీడీపీ అధికారంలోకి రాలేదు. ఎమ్మెల్సీ పదవి ఇవ్వలేదు. 2019 నుంచి 2024 వరకూ ఆయన తెలుగుదేశం పార్టీలోనే కొనసాగారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎక్కడా పోటీ చేయలేదు. కానీ.. పార్టీకోసం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని పలు నియోజకవర్గాల్లో ప్రచారం చేశారు. ముఖ్యంగా కాపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో రాధా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చింది. ఇక రాధాకు పదవీ ఖాయం అని ఆయన అనుచరులు అనుకున్నారు. మొదటి నామినేటెడ్ పోస్టు వస్తుందని ఆశించారు. రాలేదు.ఆ తర్వాత రాజ్యసభకు పంపుతారనే ప్రచారం జరిగింది. అదీ కుదరలేదు. ఇక ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాధాకు ఎమ్మెల్యే కోటాలో అవకాశం వస్తుందని ఊహించారు. అదీ జరగలేదు. దీంతో ఆయన అనుచరులు.. తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే టాక్ ఉంది. ఇన్నాళ్లుగా ఏ పదవి లేదని.. ఇప్పుడు అధికారంలో ఉన్నా.. ఎందుకు ఇవ్వడం లేదని రాధా అనుచరులు ప్రశ్నిస్తున్నారు.అటు రాధా కూడా ఆయనకు కనీస గౌరవం దక్కలేదని, తన సేవలను గుర్తించలేదని తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నట్లుగా తెలుస్తోంది. దీంతో ఏ పార్టీలోకి వెళ్లినా ఇదే పరిస్థితి ఉంటుందని భావించిన రాధా.. రాజకీయాలకు పూర్తిగా గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నారని ప్రచారం జరుగుతోంది. ఈ మధ్య రంగా, రాధా మిత్రమండలి సమావేశంలో కూడా తీవ్ర నైరాశ్యంతో మాట్లాడినట్టు సోషల్ మీడియాలో పోస్టులు వచ్చాయి. దీంతో ఆయన రాజకీయాలకు గుడ్ బై చెప్పే ఆలోచనలో ఉన్నారనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.. 'రాధా రాజకీయాలకు ఎందుకు గుడ్ బై చెప్తారు.. అలాంటిది ఏం లేదు. ఆయన చాలా కంఫర్ట్‌గా ఉన్నారు. రాధాకు ఎప్పుడు ఏ పదవి ఇవ్వాలో పార్టీ నిర్ణయిస్తుంది. అప్పటివరకు ఓపికగా ఉంటాం. కొందరు కావాలని తప్పుడు చేస్తున్నారు. రాధా రాజకీయాల్లోనే ఉంటారు. ఆ మధ్య కాస్త అనారోగ్య సమస్యల వల్ల యాక్టివ్‌గా లేరంతే' అని రాధా మిత్రుడు చెప్పారు.

# ఆపరేష్ గరుడ...

కడప మార్చి 22, ఏపీలో మెడికల్ షాపులపై అధికారులు కొరడా ఝళిపిస్తున్నారు. ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ షాపులపై దాడులు జరుగుతున్నాయి. మెడికల్ షాపులతో పాటు ఏజెన్సీలపైనా దాడులు కొనసాగిస్తున్నారు. ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్, లోకల్ పోలీసులతో పాటు డ్రగ్ కంట్రోల్ బృందాలు సంయుక్తంగా సోదాలు చేపడుతున్నారు. దాదాపు 100 బృందాలు ఏపీ వ్యాప్తంగా తనిఖీలు, దాడులు చేస్తున్నాయి. విజయవాడ, నెల్లూరు, శ్రీకాకుళం, శ్రీసత్యసాయి జిల్లాలతో పాటు ఇతర జిల్లాల్లోనూ ఈ దాడులు కొనసాగుతున్నాయి.ఆపరేషన్ గరుడలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ షాపుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం, నెల్లూరు, అనంతపురం, కడప, ఒంగోలు, విజయవాడల్లో విజిలెన్స్, ఈగల్, డ్రగ్ అధికారులు సోదాలు నిర్వహించారు. దాదాపు 100కు పైగా బృందాలతో మెడికల్ షాపుల్లో తనిఖీలు చేశారు. డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మందులు అమ్ముతున్న మెడికల్ షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా.. 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు. ఆపరేషన్ గరుడ అనేది ఆంధ్రప్రదేశ్ లోని వివిధ నేరాలను అరికట్టడానికి ఉద్దేశించిన ఒక కార్యక్రమం. ఇది ప్రధానంగా రెండు అంశాలపై దృష్టి పెడుతుంది.ఆంధ్రప్రదేశ్‌లో డ్రగ్స్ వాడకం, అమ్మకం పెరగడం వల్ల యువత చెడిపోతున్నారు. దీనిని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం "ఆపరేషన్ గరుడ" పేరుతో ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది.



# స్పోర్ట్స్ న్యూస్

## మ్యాచ్‌కు ముందు కేకేఆర్‌కు వార్నింగ్ ఇచ్చిన ఆర్సీబీ కోచ్!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 వచ్చేసింది. ఈడెన్‌గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్ – రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య మ్యాచ్‌తో ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ఆర్సీబీ కోచ్ ఆండీ ఫ్లవర్.. కోల్‌కతా జట్టుకు వార్నింగ్ ఇచ్చాడు.తాజాగా ఓ ప్రెస్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ఆండీ ఫ్లవర్ కు 'కోల్‌కతా నుంచి ఆర్సీబీకి ఇబ్బందులు తప్పవా?' అని ఓ ప్రశ్న ఎదురవ్వగా... అతడు దీటైనా సమాధానం ఇచ్చాడు. "అవును, ఈ మ్యాచ్ ఎంతో భయంకరంగా ఉండనుంది. హోరాహోరీగా ఉండబోతుంది. అయితే ఆ ఇబ్బందులు మా నుంచి కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు తప్పవు. ఐపీఎల్ 2025 సీజన్ గొప్పగా ప్రారంభం కానుందని భావిస్తున్నా. మేమంతా మా కొత్త కెప్టెన్ రజత్ పటీదార్‌కు అండగా ఉన్నాం. జట్టును పూర్తిగా అనుభవం నిండిన ఆటగాళ్లతో నింపేశాం. అతడు కూడా ఈ సవాల్ ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాడు. అతడి వెనకాల మేమున్నాం." అని ఆండీ ఫ్లవర్ పేర్కొన్నాడు."కోల్‌కతా టీమ్ లో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ రూపంలో అద్భుతమైన స్పిన్నర్లు ఉన్నారు. చక్రవర్తి గత మంచి ఫామ్ లో ఉన్నాడు. నరైన్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రపంచంలోని అత్యుత్తమ జట్టుతో ఆడినప్పుడే మనమేంటో, మన బలమేంటో తెలుస్తుంది. అంతర్జాతీయ క్రికెట్ అయినా లేదా ఐపీఎల్ అయినా ఇదే చేయాలి.""ఐపీఎల్ లో భారీ స్కోర్లు నమోదు అవ్వడం ట్రెండ్‌గా మారిపోయింది. బ్యాటర్లు బలంగా మారిపోతూ మరింత గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అలానే విరాట్ కోహ్లీ లాంటి ప్లేయర్లు ఐపీఎల్ లో మంచి స్థానం ఉంది. అతడు సూపర్ ఫిట్ గా ఉన్నాడు. బలమైన కుర్రాడిలా ఉన్నాడు. హై క్వాలిటీ, తెలివైన క్రికెటర్లకు ఐపీఎల్ లో మంచి చోటు ఉంది." అని ఆండీ ఫ్లవర్ పేర్కొన్నాడు.

## రోహిత్ శర్మకు సిరాజ్ ఘాటు సమాధానం!!

టీమిండియా స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను రీసెంట్‌గా ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం ఎంపిక చేయలేదన్న సంగతి తెలిసిందే. అందుకు గల కారణాన్ని కూడా కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. పాత బంతితో సిరాజ్ ఎక్కువ ప్రభావం చూపలేకపోతున్నాడని రోహిత్ అన్నాడు. తాజాగా ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న నేపథ్యంలో.. ఈ విషయంపై సిరాజ్ కాస్త ఘాటుగానే స్పందించాడు.అదే నా లక్ష్యం.."నేను గతంలో పాత బంతితో అత్యధిక వికెట్లు తీశాను. ప్రపంచంలోని టాప్ 10 ఫాస్టెస్ట్ బౌలర్స్‌లో ఒకడిని. నా ఎకానమి రేట్ కూడా లోగా ఉంది. నా గణాంకాలే నా ప్రదర్శన ఎలా ఉందో చెబుతాయి. నేను కొత్త బంతితో, పాత బంతితో.. రెండితోనూ బాగా రాణించాను. ప్రస్తుతం నాకు దొరికిన సమయంలో ఫిట్‌నెస్‌తో పాటు బౌలింగ్‌పై పూర్తి దృష్టి సారించాను. కొత్త బాల్ తో పాటు పాత బంతితోనూ ప్రాక్టీసింగ్ చేస్తున్నాను. అలానే నెమ్మది బంతులు, యార్కర్స్‌పై కూడా దృష్టి సారించాను. ఐపీఎల్ లో బాగా రాణించి, గుజరాత్ టైటాన్స్ కోసం టైటిల్ అందించడమే నా లక్ష్యం." అని సిరాజ్ చెప్పుకొచ్చాడు.ప్రస్తుతం సిరాజ్ అన్న మాటలు చర్చనీయాంశంగా మారాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో తనను ఎంపిక చేయకపోవడంపై వచ్చిన ఫ్రస్టేషన్‌ను.. అతడు ఐపీఎల్‌లో ఏ విధంగా చూపించి రాణిస్తాడో అని క్రికెట్



అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ఐపీఎల్ 2005 సీజన్ కోసం జరిగిన మెగా వేలంలో సిరాజ్‌ను ఆర్సీబీ విడిచిపెట్టింది. దీంతో గుజరాత్ టైటాన్స్ సిరాజ్ ను 12.25 కోట్లకు కొనుగోలు చేసింది. ఆ జట్టులో అత్యధిక ధరకు అమ్ముడుపోయిన రెండో ఆటగాడు సిరాజే కావడం విశేషం.

## రోహిత్ శర్మను అవమానించిన పాకిస్థాన్! .. వడ్డీతో సహా ఇచ్చిపడేసిన భారత్ ఫ్యాన్స్!!

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మను పాకిస్థాన్ క్రికెట్ అవమానించింది. అతడిని అనుకరిస్తూ ఓ వీడియో రిలీజ్ చేసింది. అలానే అతడిని బాడీ షేమింగ్ కూడా చేసినట్లు ఈ వీడియో చూస్తే అర్థమవుతోంది. దీంతో క్రికెట్ అభిమానులంతా పాకిస్థాన్ పై విరుచుకుపడుతున్నారు. ఇంతకీ ఆ వీడియోలో ఏముందో చూద్దాం..ఐపీఎల్‌కు పోటీగా పాకిస్థాన్ పీఎస్ఎల్ నిర్వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సీజన్ ఏప్రిల్ 11 నుంచి ప్రారంభం కానుంది. ఈ



నేపథ్యంలో పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంఛైజీ ముల్తాన్ సుల్తాన్స్.. రోహిత్ శర్మ వాయిస్ ఓవర్ తో ఓ వీడియోను విడుదల చేసింది. ఇందులో లీగ్ మస్కట్ ప్రెస్ కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్నట్లుగా ఉంది. దానికే రోహిత్ శర్మ వాయిస్ ఓవర్ ను జత చేశారు. రీసెంట్‌గా ఛాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్ లో రోహిత్ మాట్లాడిన వ్యాఖ్యలను.. తాజా మస్కట్ వీడియోలో బ్యాక్ గ్రౌండ్‌లో ప్లే చేశారు. దీంతో ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట తీవ్ర విమర్శలకు దారి తీసింది. భారత క్రికెట్ అభిమానులంతా తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు.అంతకుముందు పాకిస్థాన్ కెప్టెన్ మహ్మద్ రిజ్వాన్ ఇంగ్లీష్ మాట్లాడిన తీరును అనుకరిస్తూ... ఆసీస్ మాజీ క్రికెటర్ బ్రాడ్ హాగ్ కాస్త హాస్యాస్పదంగా మాట్లాడాడు. దీంతో తమ కెప్టెన్ ను ఇలా అవమానిస్తారా? అంటూ పాక్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేశారు. కానీ ఇప్పుడు పాకిస్థానే.. అవతలి జట్టు సారథిని అవమానిస్తే మాత్రం సైలెంటుగా ఉండటాన్ని భారత క్రికెట్ ఫ్యాన్స్ జీర్ణించుకోలేకపోతున్నారు.ఇది అత్యంత సిగ్గుమాలిన చర్య. ఓ సక్సెస్ ఫుల్ కెప్టెన్ పై బాడీ షేమింగ్ చేయడం సరికాదని కామెంట్లు చేస్తున్నారు. ఆ వీడియోను తీసేయాల్సిందే అని డిమాండ్ చేస్తున్నారు. క్షమాపణలు చెప్పాలని అడుగుతున్నారు.

## ఫ్యాన్స్ సిద్ధమా..! – ఐపీఎల్‌లో బ్రేక్ కానీ టాప్ 10 రికార్డులివే!!

ధనాధన్ పండగ ఐపీఎల్ వచ్చేసింది. రెండు నెలల పాటు అంతులేని వినోదాన్ని పంచేందుకు ఐపీఎల్ 18వ సీజన్ సిద్ధమైపోయింది. బ్యాటర్లు విధ్వంసక బ్యాటింగ్, బౌలర్లు వీరోచిత ప్రదర్శనలు, ఫీల్డర్లు అద్భుత విన్యాసాలు చేస్తూ ఉర్రూతలూగించేందుకు రెడీ అయిపోయారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్ చరిత్రలో నమోదైన రికార్డులు ఓసారి నెమరువేసుకుందాం...ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన జట్లు ముంబై, చెన్నై. ఈ రెండు జట్లు చెరో ఐదు టైటిళ్లను సాధించాయి. ముంబై ఇండియన్స్ 2013, 2015, 2017, 2019, 2020 సీజన్ లలో ఐపీఎల్ ట్రోఫీని ముద్దాడింది. చెన్నై సూపర్ కింగ్స్ 2010, 2011, 2018, 2021, 2023లో టైటిల్ గెలుచుకుంది. ఆ తర్వాతి స్థానంలో మూడు టైటిళ్లతో ( 2012, 2014, 2024) కోల్‌కతా నైట్ రైడర్స్ నిలిచింది.ఐపీఎల్‌లో క్రిస్ గేల్ అత్యధిక సిక్స్ లు బాదాడు. 357 సిక్స్ లు కొట్టాడు. ఆ తర్వాత జాబితాలో రోహిత్ శర్మ 280గా ఉన్నాడు.

ఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్లుఐపీఎల్‌లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన ప్లేయర్ల జాబితాలో క్రిస్ గేల్ మొదటి స్థానంలో ఉన్నాడు. ఆర్సీబీ తరఫున ఆడిన క్రిస్ గేల్.. పుణె వారియర్స్‌పై 66 బంతుల్లో 175 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. తద్వారా ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేశాడు. బ్రెండన్ మెకల్లమ్ 158×, క్వింటన్ డి కాక్ 140×, ఏబీ డివిలియర్స్ 133×, కేఎల్ రాహుల్ 132× తర్వాతి స్థానాల్లో ఉన్నారు.ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ యుజ్వేంద్ర చాహల్. 205 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత పియూష్ చావ్లా (192), డ్వేన్ బ్రావో (183), భువనేశ్వర్ కుమార్ (181) వరుసగా ఉన్నారు.ఐపీఎల్‌లో ఎక్కువ క్యాచ్‌లుఐపీఎల్‌లో అత్యధిక క్యాచ్ లు అందుకున్న ప్లేయర్ విరాట్ కోహ్లీ. విరాట్ కోహ్లీ 114 క్యాచ్‌లతో మొదటి స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత సురేశ్ రైనా (109), కీరన్ పొలార్డ్ (103), రవీంద్ర జడేజా (103) కొనసాగుతున్నాడు.పీఎల్‌లో అత్యధిక పరుగులుఐపీఎల్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో విరాట్ కోహ్లీ అగ్రస్థానలో కొనసాగుతున్నాడు. ఆర్సీబీకి ప్రాతినిధ్యం వహిస్తోన్న కోహ్లీ.. ఇప్పటివరకు 8,004 పరుగులతో టాప్ లో ఉన్నాడు. ఆ తర్వాత శిఖర్ ధావన్ (6,769), రోహిత్ శర్మ (6,628), డేవిడ్ వార్నర్ (6565), సురేశ్ రైనా (5528) ఉన్నారు. ఇప్పుడు వీరిలో రోహిత్ తప్ప ఇంకెవరూ ఆడట్లేదు. కాబట్టి ఇప్పట్లో కోహ్లీ రికార్డును బ్రేక్ చేయడం కష్టం.ఐపీఎల్‌లో అత్యధిక మ్యాచ్ లు ఆడిన ప్లేయర్ గా ధోనీ నిలిచాడు. ఇప్పటివరకు 264× ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. ఆ తర్వాత దినేష్ కార్తీక్ (257), రోహిత్ శర్మ (257), విరాట్ కోహ్లీ (252) ఆడారు.ఐపీఎల్ చరిత్రలో అతిపెద్ద విజయాన్ని ముంబై ఇండియన్స్ నమోదు చేసింది. ఢిల్లీ డేర్‌డెవిల్స్‌పై 146 పరుగుల తేడాతో గెలిచి రికార్డు సృష్టించింది. ఆ తర్వాత ఆర్సీబీ వేర్వేరు జట్లపై 144, 140, 138, 130 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది.సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఆర్సీబీపై 287/3తో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోర్ సాధించిన జట్టుగా నిలిచింది.

## ఇర్ఫాన్ పఠాన్‌కు షాక్.. ఆ పదవి నుంచి ఔట్!





ఐపిఎల్ 18వ సీజన్ శనివారం సాయంత్రం నుంచి ప్రారంభం కానుంది. అయితే ఈ టోర్నమెంట్ ఆరంభానికి ముందుకు టీం ఇండియా మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్‌కు ఐపిఎల్ కమిటీ షాక్ ఇచ్చింది. ఐపిఎల్ కామెంట్రీ ప్యానెల్ నుంచి అతన్ని బిసిసిఐ పక్కకు పెట్టినట్లు తెలుస్తోంది. కామెంట్రీ సమయంలో కొంతమంది ఆటగాళ్లపై కావాలనే వ్యాఖ్యలు చేసినట్లు ఇర్ఫాన్‌పై ఫిర్యాదులు వచ్చాయట. ఐపిఎల్ 18వ సీజన్‌కు సంబంధించిన కామెంట్రీ ప్యానల్ వివరాలను శుక్రవారం విడుదల చేయగా.. అందులో ఇర్ఫాన్ పేరు లేదు. అతనిపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలోనే అతని పేరును తొలగించినట్లు టాక్. అయితే కామెంట్రీ ప్యానల్ నుంచి తొలగించిన వెంటనే పఠాన్ యూట్యూబ్ ఛానల్‌ని ప్రారంభించాడు. ఈ విషయాన్ని 'మైక్ ఆన్, ఫిల్టర్ ఆఫ్' అనే క్యాప్షన్‌తో ఎక్స్ ద్వారా అభిమానులతో అతను పంచుకున్నాడు.

## క్షమించండి అంటూనే.. బౌలర్లకు చురకలు అంటించిన భజ్జీ



ఐపిఎల్ 18వ సీజన్ శనివారం సాయంత్రం నుంచి ప్రారంభంకానుంది. ఈ టోర్నమెంట్‌లో అద్భుతంగా రాణించి గుర్తింపు తెచ్చుకోవాలని యువ క్రీడాకారులు భావిస్తున్నారు. అయితే ఐపిఎల్‌లో కేవలం పరుగులు అడ్డుకోవడంపైనే స్పిన్నర్లు దృష్టి పెడుతున్నారని.. వికెట్లు తీయడంపై కాదని భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నారు.'ఇలా నేను చెప్తున్నందుకు నన్ను క్షమించండి. చాలా మంది స్పిన్ బౌలర్లు ఫాస్ట్ బౌలర్లలా తయారవుతున్నారు. ఎటాకింగ్ చేయడం లేదు. వికెట్లు తీయడానికి ఆసక్తి చూపించడం లేదు. ఇంకాస్త ధైర్యంగా బౌలింగ్ వేయడం నేర్చుకోవాలి. అవకాశాలను సృష్టించుకుంటూ.. బంతిని స్పిన్ చేయాలి. ఫ్లైట్ డెలివరీలతో వికెట్లను టార్గెట్ చేయాలి.' అని హర్భజన్ పేర్కొన్నారు. శనివారం రాయల్ ఛాలంజర్స్ బెంగళూరు, కోల్‌కతా నైట్‌రైడర్స్ మధ్య జరిగే మ్యాచ్‌తో ఐపిఎల్ ప్రారంభంకానుంది.

## క్రికెట్ లవర్స్‌కి గుడ్ న్యూస్.. పీవీఆర్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు




భారత అతిపెద్ద మల్టీప్లెక్స్ నిర్వహణ సంస్థ పీవీఆర్ సినిమాస్ మూవీ లవర్స్‌కి అదిరిపోయే ఆఫర్‌లు ప్రకటిస్తు వస్తున్న విషయం తెలిసిందే. ఇక తాజాగా ఐపీఎల్ ప్రారంభమవుతుండడంతో క్రికెట్‌ను ఇష్టపడే ప్రేక్షకుల కోసం మరో ఆఫర్‌తో మన ముందుకు వచ్చింది. నేటి నుంచి ఐపీఎల్ ప్రారంభం కానుండటంతో ఈ వేడుకలతో పాటు లైవ్ మ్యాచ్‌లను పీవీఆర్‌లో వీక్షించవచ్చని తెలిపింది. దీనికోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి తో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపింది. దేశంలోనే 30 నగరాల్లో ఈ సేవలు అందుబాటులో ఉండగా.. వీకెండ్ మ్యాచ్‌లతో పాటు ప్లేఆఫ్‌లను మ్యాచ్‌లను థియేటర్‌లలో పదర్శించనున్నట్లు వెల్లడించింది.ఈ విషయంపై పీవీఆర్ ఐనాక్స్ రెవెన్యూ మరియు ఆపరేషన్స్ సీఈఓ గౌతమ్ దత్తా మాట్లాడుతూ.. అత్యుత్తమ విజువల్స్, సౌండ్, సీటింగ్ వ్యవస్థతో మ్యాచ్‌ను స్టేడియంలో చూసినట్లే అనుభూతిని అందిస్తామని తెలిపాడు. సినిమాను క్రికెట్‌ను ఒక వేదికపై తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందని గత సంవత్సరం క్రికెట్ మ్యాచ్‌ల ప్రసారానికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిందని, అందువల్ల ఈ ఏడాది కూడా ప్రీమియం క్వాలిటీ అనుభవాన్ని అందించేందుకు ప్రసారం చేయాలని నిర్ణయించామని వివరించారు. ఇండియాలోని ప్రధాన మెట్రో నగరాలతో పాటు టైర్–2, టైర్–3 నగరాల్లోనూ ఈ స్క్రీనింగ్‌లు జరగనున్నట్లు పీవీఆర్ ఐనాక్స్ తెలిపింది. మరిన్ని వివరాల కోసం పీవీఆర్ వెబ్‌సైట్‌ను విజిట్ చేయడంటూ సీఈఓ గౌతమ్ దత్తా వెల్లడించాడు.

## అమ్మ దీనమ్మ బత్తాయో..!

మండే వేసవిలో అంతులేని వినోదాన్ని పంచడానికి, రెండు నెలల పాటు సంబరాల్లో ముంచెత్తడానికి ఐపీఎల్ 2025 సీజన్ సిద్ధమైంది. కొన్ని కొత్త నిబంధనలు.. కొందరు కొత్త కెప్టెన్లతో సరికొత్తగా ఐపీఎల్ 18వ సీజన్‌కు తెరలేవనుంది. మరికొద్ది గంటల్లో డిఫెండింగ్ ఛాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్), రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) మధ్య జరిగే మ్యాచ్‌తో ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుంది.అయితే ఉప్పల్ వేదికగా ఆదివారం రాజస్థాన్ రాయల్స్‌తో జరిగే మ్యాచ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ టైటిల్ వేటను ప్రారంభించనుంది. ఈ మ్యాచ్‌కు ముందే ఇరు జట్ల అభిమానులు సోషల్ మీడియా వేదికగా సవాళ్లు విసురుకుంటున్నారు. గతంలో ఈ ఇరు జట్ల మధ్య సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధమే నడిచింది. గతంలో సన్‌రైజర్స్‌ను అవమానించేలా.. ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ రెచ్చగొట్టేలా రాజస్థాన్ రాయల్స్ అడ్మిన్ పోస్ట్‌లు పెట్టేవాడు.ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును ఆరెంజ్ జ్యూస్‌తో పోల్చుతూ రెచ్చగొట్టేవాడు. ఓటమి బాధలో ఉన్న ఫ్యాన్స్‌కు పుండు మీద కారం చల్లేలా సెటైరికల్ పోస్ట్‌లతో ఉక్కిరి బిక్కిరి చేసేవాడు. ఆరెంజ్ ఆర్మీ ఆటగాళ్ల జ్యూస్ పిండేస్తామనే ఉద్దేశంతో ఆరెంజ్ జ్యూస్ ఫొటోనూ షేర్ చేసేవాడు. సన్‌రైజర్స్ ఓడిపోతే.. జ్యూస్ పిండేసామనే అర్థం వచ్చేలా ఖాళీ గ్లాస్‌ను పెట్టేవాడు.అంతేకాకుండా సన్‌రైజర్స్ ఓటమిని ఎగతాళి చేస్తూ బిర్యానీ ఆర్డర్ చేసుకుంటామని ట్వీట్ చేసేవాడు.


# బరువును తగ్గించడమే కాదు మెరిసే చర్మాన్ని అందించే అద్భుత పానీయం!





వేసవి తాపం నుండి ఉపశమనం పొందడానికి, శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడానికి ఇది ఒక అద్భుతమైన మార్గం బార్లీ నీళ్లు. అంతే కాదు దీనిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికి ఒక సహజమైన, రుచికరమైన , శక్తివంతమైన పానీయం ఇది. ఇది శతాబ్దాలుగా అనేక సంస్కృతులలో ఆరోగ్యకరమైన మరియు రిఫ్రెష్ పానీయంగా ఉపయోగించబడుతోంది. దీనిని ఇంట్లోనే సులభంగా తయారు చేసుకోవచ్చు.శరీర డిటాక్స్‌కు సహాయపడుతుందిబార్లీ నీరులో పొటాషియం, మాంగనీస్, విటమిన్ ః కాంప్లెక్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి కాలేయాన్ని శుద్ధి చేయడంతోపాటు మలినాలను బయటికి పంపించేందుకు సహాయపడతాయి. శరీరంలోని విషపదార్థాలను బయటికి పంపి, కొత్త ఒర్రని అందిస్తుంది. అంతే కాకుండా ఈ నీరు ఆమ్లత్వాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పొటాషియం , మగ్నీషియం పేగుల్లో మంచి బ్యాక్టీరియాను పెంచి, అజీర్ణం, మలబద్ధకం సమస్యలను తగ్గిస్తాయి. ఇది అల్సర్, గ్యాస్ ట్రబుల్ ఉన్నవారికి మంచి ఔషధంగా పని చేస్తుంది.బరువు తగ్గేందుకు ఉపకరిస్తుందిబార్లీ నీరులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది పెట్టుని ఎక్కువ సేపు నిండుగా ఉంచుతుంది. ఆకలి నియంత్రణకు సహాయపడుతుంది, ఫలితంగా అధిక భోజనం చేయకుండా ఉంటుంది. కొవ్వు కరుగుదల త్వరగా జరిగేలా సహాయపడుతుంది. అంతే కాకుండా బార్లీ నీరు సహజమైన డయూరేటిక్ (మూత్ర విసర్జనను పెంచే పదార్థం) గా పనిచేస్తుంది. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు  తగ్గించడంలో సహాయపడుతుంది. కిడ్నీ స్టోన్స్ రూపాన్ని అడ్డుకోవడానికి బార్లీ నీరు మంచి సహాయకారి.గుండె ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుందిబార్లీ నీరులో బీటా-గ్లూకాన్ అనే ఫైబర్ ఉంది, ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అధిక కొలెస్ట్రాల్‌ను తగ్గించి, హృదయ సంబంధిత వ్యాధులను నివారించగలదు. రక్తపోటును నియంత్రించడంతోపాటు, గుండెకు కావలసిన పోషకాలను అందిస్తుంది. గర్భిణీ స్త్రీలకు హార్మోన్లను బ్యాలెన్స్ చేయడంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో ఉబ్బసం సమస్యలను తగ్గిస్తుంది.చర్మ సౌందర్యాన్ని పెంచుతుందిబార్లీ నీరులో యాంటీఆక్సిడెంట్లు, సెలెనియం ఉన్నాయి. ఇవి చర్మ కాంతిని మెరుగుపరిచి, వృద్ధాప్య లక్షణాలను తగ్గిస్తాయి. నిత్యం బార్లీ నీరు తాగడం వల్ల చర్మం మృదువుగా, తేలికగా ఉంటుంది. మొటిమలు, చర్మంలోని మృతకణాలు తొలగడానికి సహాయపడుతుంది. అటు బార్లీ నీరులో ఉన్న ఫైబర్ పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, కాలన్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించగలదు. ఇది పేగుల కదలికలను మెరుగుపరిచి, మలబద్ధకాన్ని నివారిస్తుంది.బ్లడ్ షుగర్ నియంత్రణబార్లీ నీరు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి, డయాబెటిస్ ఉన్నవారికి బాగా ఉపయోగపడుతుంది. గ్లూకాన్ అనే ఫైబర్ ఇన్సులిన్ రెసిస్టెన్స్ తగ్గించి రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించగలదు. బార్లీ నీరులో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్ఫరస్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎముకలను బలంగా ఉంచడానికి సహాయపడతాయి.

# కీళ్ల నొప్పులకు చెక్ .. ఈ సూపర్ ఫుడ్స్ ట్రై చేయండి!



కీళ్ల నొప్పులు.. ఈ పేరు వింటేనే చాలామంది వణికిపోతారు. వయసుతో సంబంధం లేకుండా ఎందరినో వేధిస్తున్న సమస్య ఇది. కీళ్ల నొప్పులు రావడానికి ఎన్నో కారణాలున్నాయి. వంశపారంపర్యంగా రావచ్చు, ఆర్థరైటిస్ వంటి సమస్యల వల్ల రావచ్చు, లేదా శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల కూడా కీళ్ల నొప్పులు వస్తాయి. కారణం ఏదైనా నొప్పి మాత్రం నరకం చూపిస్తుంది. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా ఈ నొప్పుల నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం.. కీళ్ల నొప్పులను తగ్గించే ఆహారాలు: చేపలు: సాల్మన్, ట్యూనా, మాకేరెల్ వంటి చేపల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో మంటను తగ్గించి కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. వారానికి కనీసం రెండుసార్లు చేపలు తినడం మంచిది. ఆకుకూరలు: పాలకూర, బచ్చలికూర, మెంతికూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా పాలకూరలో ఉండే సల్ఫోరాఫేన్ అనే సమ్మేళనం కీళ్లలో మంటను తగ్గిస్తుంది. పండ్లు: నారింజ, బత్తాయి, నిమ్మ వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కీళ్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే బెర్రీలు, చెర్రీలు వంటి పండ్లలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కీళ్లలో మంటను తగ్గిస్తాయి.  గింజలు, విత్తనాలు: బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా విత్తనాలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఇ, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిని రోజూ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది.  పసుపు: పసుపులో కర్కుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీగా పనిచేస్తుంది. పసుపును ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చు. పసుపు పాలు తాగడం లేదా కూరల్లో పసుపు వేసుకోవడం మంచిది. అల్లం: అల్లంలో జింజెరాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్ల నొప్పులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. అల్లాన్ని టీలో వేసుకుని తాగడం లేదా కూరల్లో ఉపయోగించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వెల్లుల్లి: వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. రోజూ రెండు మూడు వెల్లుల్లి రెబ్బలు తినడం ఆరోగ్యానికి మంచిది. ఆలివ్ ఆయిల్: ఆలివ్ ఆయిల్‌లో ఒలియోకాంతల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్లలో మంటను తగ్గిస్తుంది. వంటల్లో ఆలివ్ ఆయిల్ ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. రెచ్చిపోతారు ఇక! తీసుకోవలసిన జాగ్రత్తలు: సరైన ఆహారంతో పాటు వ్యాయామం కూడా చాలా ముఖ్యం. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం వల్ల కీళ్లు దృఢంగా ఉంటాయి. బరువును అదుపులో ఉంచుకోవడం కూడా చాలా అవసరం. అధిక బరువు వల్ల కీళ్లపై ఒత్తిడి పెరిగి నొప్పులు వచ్చే అవకాశం ఉంది.

# వేసవిలో శక్తినిచ్చే సూపర్ ఫుడ్స్ ఇవే!


చాలామంది వేసవికాలంలో ఎండ దెబ్బకు శరీరం డిహైడ్రేట్ అయ్యి శక్తిని కోల్పోయి నీరసంగా ఫీల్ అవుతూ ఉంటారు. అటువంటివారు సమ్మర్లో రోజంతా చురుకుగా ఉండడానికి శక్తినిచ్చే ఆరు రకాల సూపర్ ఫుడ్స్ ను తింటే మంచిదని డైటీషియన్లు చెప్తున్నారు. ఇక ఆ సూపర్ ఫుడ్స్ ఏంటి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. అరటి పండ్లు అరటి పండ్లు మంచి పోషకాలతో కూడుకున్న ఆహారం. అరటి పండ్లలో పొటాషియం, కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి కావలసిన శీఘ్ర శక్తిని అందిస్తాయి. వీటిని ప్రీ వర్కవుట్ ఫుడ్ గా కూడా తీసుకోవచ్చు. గ్రీన్ టీ గ్రీన్ టీ కూడా మనకు శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుంది. గ్రీన్ టీ తాగితే ఇది మన శరీరంలో అలసటను తగ్గించి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు శక్తి స్థాయిలను కూడా ఇది పెంపొందిస్తుంది. కనుక ఈ సీజన్ లో గ్రీన్ టీ తాగడం ఎంతో మంచిది. పాలకూర పాలకూరలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఎవరైతే తక్కువ ఐరన్ స్థాయిలు కలిగి ఉంటారో వారు శక్తి హీనులుగా ఉంటారు. ఇక శక్తి వంతులుగా ఉండాలంటే కచ్చితంగా ఆహారంలో పాలకూరని భాగంగా చేసుకోవడం సూచించదగింది. చియా సీడ్స్ చియా సీడ్స్ ను కూడా మనం ఒక సూపర్ ఫుడ్ గా చెప్పుకోవాలి. చియా సీడ్స్ ను నానబెట్టి తీసుకోవడం వల్ల శక్తి వస్తుంది. ఇందులో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ మన శరీరానికి కావాల్సిన ఎనర్జీని ఇచ్చి ఎంతగానో దోహదం చేస్తాయి. డార్క్ చాక్లెట్ డార్క్ చాక్లెట్ చిన్న ముక్కను ప్రతిరోజు తింటే మన శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్లను శరీరానికి అందిస్తుంది. అలసటను తగ్గించి శక్తిని పెంచుతుంది. దృష్టిని కూడా మెరుగుపరుస్తుంది. ఓట్స్ ఓట్స్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఓట్స్ తిన్న తర్వాత మన శరీరంలో శక్తి పెరుగుతుంది. ఇక ఎండాకాలంలో అలసటతో బాధపడేవారు, శక్తి తక్కువగా ఉందని ఇబ్బంది పడేవారు, మీ ఆహారంలో ఓట్స్ తీసుకుంటే మంచిది.



# వారసత్వ బట్టతలకు చెక్.. నివారణోపాయాలు ఇవిగో!

జుట్టు రాలడం అనేది వయసుతో పాటు వచ్చే సహజ ప్రక్రియ. కానీ, కొందరికి యుక్త వయసులోనే జుట్టు పలుచబడి బట్టతల రావడం ఆందోళన కలిగిస్తుంది. బట్టతల రావడానికి అనేక కారణాలున్నప్పటికీ, జన్యుపరమైన కారణాలు ప్రధానమైనవి. మీ తాత ముత్తాతలకు బట్టతల ఉంటే మీకు కూడా వచ్చే అవకాశం ఉందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే, బట్టతల వెనుక దాగి ఉన్న జన్యు రహస్యాలను తెలుసుకోవాలి. వారసత్వమే ప్రధాన కారణమా? బట్టతల రావడానికి వంశపారంపర్యంగా వచ్చే జన్యువులే ప్రధాన కారణమని శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయి. ఆండ్రోజెనెటిక్ అలోపేసియా అని పిలువబడే సాధారణ బట్టతల, జన్యువుల ద్వారా సంక్రమిస్తుంది. ఈ పరిస్థితిలో, జుట్టు కుదుళ్లు చిన్నగా, బలహీనంగా మారుతాయి. దీని ఫలితంగా జుట్టు రాలడం ప్రారంభమవుతుంది. ముఖ్యంగా పురుషుల్లో నుదుటి భాగంలో, నెత్తి మధ్యలో జుట్టు రాలడం ఎక్కువగా కనిపిస్తుంది. బట్టతల అనేది ఒక సంక్లిష్టమైన లక్షణం. ఇది ఒకే జన్యువు ద్వారా కాకుండా అనేక జన్యువుల కలయిక ద్వారా ప్రభావితమవుతుంది. అంటే, మీ తల్లిదండ్రులిద్దరి నుండి సంక్రమించే జన్యువులు మీ జుట్టు ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి, మీ తండ్రికి బట్టతల లేకపోయినా, మీ తల్లి వైపు బంధువులకు ఉంటే మీకు బట్టతల వచ్చే అవకాశం ఉంది. బట్టతలకు కారణమయ్యే ఇతర అంశాలు: జన్యువులే కాకుండా, ఇతర అంశాలు కూడా బట్టతలకు కారణమవుతాయి. వాటిల్లో హార్మోన్ల అసమతుల్యత ఒకటి. ఆండ్రోజెన్ అనే హార్మోన్ జుట్టు పెరుగుదలను ప్రభావితం చేస్తుంది. ఈ హార్మోన్ స్థాయి పెరిగినప్పుడు జుట్టు కుదుళ్లు కుంచించుకుపోయి జుట్టు రాలడం మొదలవుతుంది. అంతే కాకుండా వయస్సు పెరిగే కొద్దీ జుట్టు కుదుళ్లు బలహీనమవుతాయి. దీనివల్ల జుట్టు రాలడం సాధారణం. మరోవైపు సరైన పోషకాహారం లేకపోవడం వల్ల జుట్టు ఆరోగ్యం దెబ్బతింటుంది. విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు తగినంతగా తీసుకోకపోతే జుట్టు బలహీనంగా మారుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడి జుట్టు రాలడానికి దారితీస్తుంది. ఒత్తిడి హార్మోన్ల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది జుట్టు కుదుళ్లను ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ సమస్యలు, రక్తహీనత, కొన్ని రకాల చర్మ వ్యాధులు జుట్టు రాలడానికి కారణమవుతాయి. కొన్ని రకాల మందులు, కీమోథెరపీ జుట్టు రాలడానికి దారితీస్తాయి.  బట్టతలను నివారించడం ఎలా? వారసత్వంగా బట్టతల వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా జుట్టు రాలడాన్ని తగ్గించవచ్చు. విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోండి. యోగా, ధ్యానం, వ్యాయామం వంటి వాటి ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. జుట్టును శుభ్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో కూడిన ఉత్పత్తులను వాడకుండా సహజమైన ఉత్పత్తులను ఉపయోగించాలి. జుట్టు రాలడం ఎక్కువగా ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి. బట్టతల అనేది ఒక సాధారణ సమస్య అయినప్పటికీ, దాని గురించి దిగులు చెందాల్సిన అవసరం లేదు. సరైన జాగ్రత్తలు, చికిత్సలతో జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. ఒకవేళ బట్టతల వచ్చినా, ఆత్మవిశ్వాసంతో ఉండటం ముఖ్యం. ఎందుకంటే, మీ వ్యక్తిత్వం మీ జుట్టు కన్నా ఎంతో విలువైంది.






# జెర్సీ ఏడుపు సినిమా కాదు!



సితార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో నాగవంశీ నిర్మించిన మ్యాడ్ స్క్వేర్ మార్చి 28న రిలీజ్ కానున్న విషయం తెలిసిందే. ప్రమోషన్స్ లో భాగంగా నిర్మాత నాగ వంశీ, డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ ను సంగీత్ శోభన్ ఇంటర్వ్యూ చేశాడు. ఈ ఇంటర్వ్యూలో నాగ వంశీ మ్యాడ్ స్క్వేర్ గురించి మరియు పలు ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకున్నాడు. ఇంటర్వ్యూలో భాగంగా సంగీత్ శోభన్, నిర్మాత నాగవంశీని ఎందుకు సప్తసాగరాలు దాటి లాంటి శాడ్ సినిమాలు నచ్చవని చెప్తుంటారు మీరు అని అడిగాడు. దానికి నాగవంశీ చాలా స్పష్టంగా క్లారిటీ ఇచ్చాడు. జీవితంలో ప్రతి ఒక్కరికీ కష్టాలుంటాయి. కష్టాలు, బాధలు లేని మనిషే ఉండడని, ఒకవేళ ఉంటే వాళ్లు మనుషులు కాదు దేవుళ్లే అని చెప్పాడు. తమ కష్టాలన్నింటినీ మర్చిపోయి రెండు గంటల పాటూ ఎంజాయ్ చేయడానికి సినిమాకు వస్తే మనం సినిమాతో నవ్వించాలి లేదంటే తమ ఫేవరెట్ హీరోలను చూపించి వారికి హై మూమెంట్స్ ఇవ్వాలి తప్పించి సినిమాల్లో కూడా మనం కష్టాలనే చూపించి, వారి బాధలనే చూపిస్తుంటే వాళ్లు ఎంజాయ్ చేసేదేముందనిపిస్తుందని, అందుకే తనకు శాడ్ సినిమాలు నచ్చవని నాగవంశీ చెప్పాడు. అలా అనుకున్నప్పుడు జెర్సీ ఎంటర్టైనింగ్ సినిమా కాదు కదా, ఒక ఫెయిల్యూర్ మ్యాన్ కథను ఎందుకు చూపించారు అని సంగీత్ అడగ్గా దానికి నాగవంశీ సమాధానం చెప్పాడు. అందరూ జెర్సీ సినిమాను శాడ్ సినిమా శాడ్ ఎండింగ్ అనుకుంటారు కానీ క్లైమాక్స్ లో కొడుకు వచ్చి చెప్తాడు, మా నాన్న ఫెయిల్యూర్ కాదు, చనిపోతానని తెలిసి కూడా ఫైట్ చేసి గెలిచాడని గర్వంగా చెప్తాడు. ఇండియన్ టీమ్ కు సెలెక్ట్ అయిన ఓ సక్సెస్‌ఫుల్ పర్సన్ కథలానే జెర్సీని చూపించామని, ఆడియన్స్ కూడా అదే హై లో థియేటర్ నుంచి బయటికొస్తారని నాగవంశీ చెప్పాడు. నాగవంశీ జెర్సీ గురించి చెప్పిన ఈ మాటలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక మ్యాడ్ స్క్వేర్ సినిమాలో ఒక చిన్న క్రైమ్ స్టోరీని లింక్ చేశామని, అందులో ఎలాంటి లాజిక్ ఉండదని, రేపు సినిమా చూశాక రివ్యూల్లో ఆ క్రైమ్ కథలో లాజిక్ లేదని రాస్తారేమో, దాన్ని కేవలం కథలో మరికొంత కామెడీని జెనరేట్ చేయడానికే పెట్టాం తప్పించి అందులో ఎలాంటి లాజిక్స్ లేవని ముందే చెప్తున్నానని నాగవంశీ తెలిపాడు.



# ప్రభాస్ కి అన్నయ్య అతడే అయితే సంచలనమే!

పాన్ ఇండియాలో ప్రభాస్ ఎంత పెద్ద స్టార్ అన్నది చెప్పాల్సిన పనిలేదు. అతడి కటౌట్ కూడా అలాంటిం దే. అందుకే ఇండియాలో ఎంత మంది స్టార్లు ఉన్నా? ప్రభాస్ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. అతడు పాన్ ఇండియాకి కనెక్ట్ అవ్వడానికి కూడా ప్రధాన కారణం ఆ కాటౌట్ కూడా ఒకటి.' సాహో' చిత్రం సౌత్ లో ఫెయిలైనా నార్త్ మార్కెట్ లో మాత్రం సంచలన వసూళ్లు రాబట్టినప్పుడు మరోసారి డార్లింగ్ స్టామినా ఏంటన్నది అర్ధమైంది. అటుపై 'సలార్', 'కల్కి 2898' లాంటి బ్లాక్ బస్టర్లతో మరింత స్ట్రాంగ్ అయ్యాడు. ఇప్పుడా భారీ కటౌట్ తో సంచలన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రానికి రంగం సిద్దం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో ప్రభాస్ కాఫ్ గా కనిపించనున్నాడు. సందీప్ మార్క్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. ఇందులో నెక్స్ట్ లెవల్ యాక్షన్ ఉంటుందని ఇప్పటికే హింట్ కూడా ఇచ్చేసాడు. మరి అలాంటి కంటెంట్ లో సంజయ్ దత్ కూడా భాగమైతే ఎలా ఉంటుంది? అందులోనూ ప్రభాస్ కి అన్నయ్య పాత్రలో ఖల్ నాయక్ కనిపిస్తే ఇంకెలా ఉంటుంది? వెండి తెరపై అది అద్భుతమే కదా. ఇప్పుడా ఛాన్స్ తీసుకోవడానికి సందీప్ రెడ్డి వంగా సిద్దంగా ఉన్నట్లు సన్నిహితుల సమాచారం. ప్రభాస్ కి అన్నయ్య పాత్రలో సంజయ్ దత్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ప్రభాస్ వయసు..కటౌట్ ఆధారంగా సంజయ్ దత్ అయితే పక్కాగా సరితూగుతాడని సందీప్ భావిస్తు న్నాడుట. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఇప్పటికే సంజయ్ దత్ సౌత్ సినిమాల్లో నటించడం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. 'కేజీఎఫ్' లో విలన్ గా నటించాడు. 'లియో', 'డబుల్ ఇస్మార్ట్' లోనూ నటించాడు. ఈ చిత్రాలు సౌత్ లో ఆయనకు మంచి క్రేజ్ ని తీసుకొచ్చినవే.




# బిజినెస్ మేనేజ్మెంట్ కోసం వచ్చిన భాగ్యశ్రీ...!

గత ఏడాది రవితేజతో కలిసి 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన భాగ్యశ్రీ బోర్సే మంచి గుర్తింపు దక్కించుకుంది. టాలీవుడ్‌లో మొదటి సినిమా ఫ్లాప్ అయినా అందంతో అందరి దృష్టిని ఆకర్షించింది. టాలీవుడ్‌కి మరో మంచి హీరోయిన్ దొరికింది అనిపించుకుంది. మిస్టర్ బచ్చన్ ఫలితంతో సంబంధం లేకుండా ఏకంగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండకు జోడీగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సినిమాను చేసే అవకాశం దక్కించుకుంది. విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతున్న 'కింగ్డమ్' సినిమాతో భాగ్యశ్రీ బోర్సే మరోసారి తన అదృష్టం పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. కింగ్డమ్ హిట్ అయితే భాగ్యశ్రీ టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. మహారాష్ట్రలో పుట్టిన భాగ్యశ్రీ బోర్సే చిన్న వయసులోనే ఫ్యామిలీతో కలిసి సౌత్ ఆఫ్రికా వెళ్లింది. నైజీరియాలోని లాగోస్‌లో భాగ్యశ్రీ చదువుకుంది. బిజినెస్ మేనేజ్మెంట్ చేయడం కోసం ఇండియాకు వచ్చిన భాగ్యశ్రీ బోర్సే మోడలింగ్‌పై ఆసక్తిని కనబర్చింది. పలు యాడ్‌లలో నటించిన భాగ్యశ్రీకి డైరీ మిల్క్ చాక్లెట్ యాడ్ మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆ యాడ్‌తో వచ్చిన గుర్తింపుతో బాలీవుడ్ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. అక్కడ నుంచి టాలీవుడ్‌లో ఈ అమ్మడు అడుగు పెట్టింది. మొత్తానికి బిజినెస్ మేనేజ్మెంట్ చేసేందుకు సౌత్ ఆఫ్రికా నుంచి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే మోడలింగ్‌పై ఆసక్తితో యాడ్స్‌లో నటించి, అటు నుంచి ఏకంగా సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. హరీష్ శంకర్ ఈమెను ఒక యాడ్‌లో చూసి రవితేజకు జోడీగా నటింపజేశాడని సమాచారం. రవితేజ సరసన నటించడంతో మంచి గుర్తింపు దక్కించుకున్నప్పటికీ, ఆ సినిమా సక్సెస్ కాకపోవడంతో ఎక్కువ ఆఫర్లు రాలేదు. అయితే విజయ్ దేవరకొండతో ఈమె కలిసి నటిస్తున్న కింగ్డమ్ పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయని ఇటీవల విడుదలైన టీజర్ చెప్పకనే చెబుతోంది. కింగ్డమ్ సినిమా కనుక సూపర్ హిట్ అయితే కచ్చితంగా టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ భాగ్యశ్రీ బోర్సే బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. కింగ్డమ్ సినిమాను పాన్ ఇండియా రేంజ్‌లో భారీ ఎత్తున విడుదల చేయడం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.  ఎంతో మంది హీరోయిన్స్ ఇండస్ట్రీలో చాలా కష్టపడి ఎంట్రీ ఇస్తారు. అంతకు ముందు అవకాశాల కోసం చాలా కష్టాలు పడుతారు. కానీ భాగ్యశ్రీ మాత్రం అనూహ్యంగా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. బిజినెస్ మేనేజ్మెంట్ కోసం ఇండియాకు వచ్చిన భాగ్యశ్రీ మోడలింగ్‌పై ఆసక్తిని కనబర్చడం, ఆ తర్వాత సినిమాల్లో పిలిచి మరీ అవకాశాలు ఇవ్వడం అదృష్టం గా భావించవచ్చు. అదే అదృష్టంతో కింగ్డమ్ హిట్ అయితే భాగ్యశ్రీ భాగ్యరేఖ మారినట్లే అనే అభిప్రాయంను సినీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. భాగ్యశ్రీ ముందు ముందు టాలీవుడ్ యంగ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమె అందాన్ని అభిమానించే వారు అంటున్నారు.



# మోహన్‌లాల్.. ఏకంగా ప్రభాస్ రికార్డునే కొట్టేశాడు



మలయాళ సినిమాల్లో మోహన్‌లాల్ పేరు చెప్పగానే ఈమధ్య ఎక్కువగా గుర్తొచ్చే చిత్రం 'లూసీఫర్'. ఆ పొలిటికల్ థ్రిల్లర్ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా సీక్వెల్ 'ఎల్2: ఎంపురాన్' మరింత పవర్ఫుల్ కాన్సెప్ట్‌తో థియేటర్లకు వస్తోంది. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా టీజర్, ట్రైలర్ అన్ని భాషల్లో మంచి స్పందన తెచ్చుకున్నాయి. విడుదలకు ముందే భారీ అంచనాలు ఏర్పడుతున్న ఈ సినిమాపై ఇప్పుడు ఆసక్తికర రికార్డులు నమోదవుతున్నాయి. తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో డబ్ అయినా ఈ సినిమా మలయాళం మార్కెట్‌లో మాత్రం అసలైన రచ్చ చేస్తోంది. మోహన్‌లాల్‌కు కేరళలో ఉన్న ఫాలోయింగ్ ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కానీ ఈసారి ఎల్2 సినిమా కోసం బుకింగ్‌లను చూసి ఇండస్ట్రీ మొత్తం షాక్ అయ్యింది. కొన్ని సంవత్సరాల క్రితం వరకు బుక్ మై షోలో గంటకు పదివేలు టికెట్లు బుక్ కావడమే గొప్ప విషయం అనుకునేవారు. కానీ ఇప్పుడు టాప్ హీరోల సినిమాలు గంటల వ్యవధిలో లక్షల టికెట్లు అమ్ముడవుతున్నాయి. ఇందులో కొత్త రికార్డు బుక్ మై షోలో 'ఎల్2: ఎంపురాన్' క్రియేట్ చేసింది. రిలీజ్‌కు వారం ముందే బుకింగ్స్ ఓపెన్ అయినా, తొలి 24 గంటల్లోనే 6.28 లక్షల టికెట్లు అమ్ముడుపోయాయి. ఇదే బుక్ మై షో చరిత్రలో హయ్యస్ట్ ప్రీ సేల్ రికార్డ్. గతంలో ప్రబాస్ నటించిన కల్కి 2898 ఏడీ మొదటి రోజు 3.41 లక్షల టికెట్లు మాత్రమే అమ్ముడవ్వగా, మోహన్‌లాల్ ఈ రికార్డును రెట్టింపు చేసి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ నెంబర్లు చూస్తుంటే మొదటి రోజు వసూళ్లు భారీగా వచ్చే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సినిమాపై మలయాళ ప్రేక్షకులతో పాటు ఇతర భాషల్లో కూడా ఆసక్తి ఉండటంతో దేశవ్యాప్తంగా పెద్ద రిలీజే జరుగుతోంది. మాస్, క్లాస్ ఆడియెన్స్ ఇద్దరినీ ఆకట్టుకునేలా రాజకీయ ఎలిమెంట్స్‌తో కూడిన స్క్రీన్‌ప్లే ఉండబోతోందన్న బజ్ ఉంది. మోహన్‌లాల్, పృథ్వీరాజ్ కాంబినేషన్‌లో రావడం, మ్యూజిక్ డైరెక్టర్ దీపక్ దేవ్ మ్యూజిక్, అద్భుతమైన విజువల్స్ ఈ సినిమాను గ్రాండ్‌గా నిలబెట్టబోతున్నాయి. ఇందులో మోహన్‌లాల్ నటన మరోసారి హైలెట్ అయ్యే నమ్మకం అభిమానుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతున్న 'ఎల్2: ఎంపురాన్' ఇప్పుడు మలయాళ సినిమా మార్కెట్‌కు కొత్త హైప్ తెస్తోంది. బుకింగ్స్ ఈ రేంజ్‌లో ఉంటే.. రికార్డుల పరంపర మొదలైపోయిందనుకోవచ్చు.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**